# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | మంగళవారం-02-సెప్టెంబర్-2025 | సంపుటి : 3 | సంచిక : 96 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# చెరువుల పరిస్థితిపై సమగ్ర అధ్యయనం చేయండి

- వర్షా లకు జరిగిన నష్టానికి సంబంధించి కేంద్రం నిధులు రాక పోవడంపై సీఎం ఆరా
- జిల్లా కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- హెచ్ఎండీఏ పరిదిలో చెరువులను వెంటనే నోటిఫై చేయండి
- ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

రాష్ట్రంలో వర్షాలు, వరదల నష్టంపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో సమీక్షించారు. వర్షాల కారణంగా 1,052 చోట్ల 1,023 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయని సీఎం దృష్టికి ఉన్నతాధికారులు తీసుకువెళ్లారు. దీనిపై సమగ్ర నివేదిక అందజేయాలని వారిని ఆదేశించారు. అలాగే గతేడాది భారీ వర్షాలకు జరిగిన నష్టానికి సంబంధించి కేంద్రం నుంచి నిధులు రాక పోవడంపై సీఎం ఆరా తీశారు. ఈ అంశాన్ని వెంటనే కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లాలని ఉన్నతాధికారులకు ఆయన సూచించారు. ఇక భారీ వర్షాల సమయంలో చెరువులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని చెరువుల పరిస్థితిపై సమగ్ర అధ్యయనం చేయాలని చెప్పారు. ఇప్పటి వరకు విపత్తు నిర్వహణ నిధుల కింద చేపట్టిన పనుల వివరాలతో కూడిన నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్లను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వర్షాలు, వరదల కారణంగా జరిగిన పంట నష్టం అంచనా వేసి తక్షణమే నివేదిక సైతం అందజేయాలని సూచించారు.

గత ఏడాది ఏర్పాటు చేసిన ఎస్డీఆర్ఎఫ్.. వరదల సమయంలో బాగా పని చేసిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు.

మిగతా 2లో



## కేసీఆర్‌పై అవినీతి మరకకు హరీశ్‌రావు, సంతోష్‌రావే కారణం

- పార్టీ భవిష్యత్తుపై కవిత ఆవేదన
- నన్ను విమర్శిస్తే ఖబడ్దార్ అంటూ హెచ్చరిక
- సీబీఐ విచారణ కేసీఆర్‌పై ప్రతిష్ట దెబ్బతీయడానికే: కవిత
- అభివృద్ధి విషయంలో కేసీఆర్ నిజాం బాటలోనే నడుస్తారని వ్యాఖ్య

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

పార్టీ అధినేత పక్కన ఉంటూ ఆయన పేరు చెప్పుకుని అనేక రకాలుగా లబ్ధి పొందిన వారు చేసిన చెత్త పనుల వల్లే కేసీఆర్‌కు అవినీతి మరక అంటిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. కాళేశ్వరం అంశంలో కేసీఆర్‌కు అవినీతి మరక అంటడంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌రావుతో పాటు కాంట్రాక్టర్ మెఘా కృష్ణారెడ్డి పాత్ర ఉందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో మేజర్ పాత్ర ఉన్నందునే ఐదేళ్ల పాటు నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావును రెండోసారి ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ దూరంగా పెట్టారన్నారు.

మిగతా 2లో



## తెలుగు రాష్ట్రాల ఎంపీలు ఆత్మ ప్రభోదానుసారం ఓటు వేయాలి

- దేశవ్యాప్తంగా తెలుగు వెలగాలంటే సుదర్శన్ రెడ్డి గెలవాలి
- ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి రేవంత్ రెడ్డి మద్దతు
- జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలిస్తే తెలుగు వారి ప్రతిష్ట పెరుగుతుంది
- జస్టిస్ సుదర్శన్ రెడ్డికి సుదీర్ఘ అనుభవం ఉంది
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో

## తెలంగాణకు ఆరెంజ్ అలెర్ట్ జారీ

- తదుపరి నాలుగురోజులు తెలంగాణలో భారీ వర్షా ల సూచన
- ఈశాన్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావం
- ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం
- ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాలు
- ఎల్లో అలర్ట్ కింద ఉన్న ప్రాంతాలు
- మంగళవారం, బుధవారం వర్షా ల అంచనాలు
- సెప్టెంబర్ 4న తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు
- గత 24 గంటల్లో రికార్డు చేసిన వర్షపాతం వివరాలు

2లో





## పిల్లల్ని ఎత్తుకెళ్లే ముఠా అరెస్ట్

- నగరంలో చిన్నారుల్ని కిడ్నాప్ చేస్తూ టెన్షన్ పుట్టించిన ముఠా
- ఇంట్లో పెద్దలు లేని సమయాల్లో పిల్లలను టార్గెట్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

హైదరాబాద్ ప్రజలకు బీ అలెర్ట్.. మీ పిల్లలు జాగ్రత్త. నగరంలో చిన్నారుల్ని కిడ్నాప్ చేస్తూ టెన్షన్ పుట్టించిన ఓ ముఠా చివరకు పోలీసుల చేతికి చిక్కింది. పిల్లలను ఎత్తుకుపోయి వారిని విక్రయించేందుకు యత్నించిన ఈ ముఠాలో నలుగురిని చందానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుపై మాదాపూర్ డీసీపీ వినీత్ మంగళవారం మీడియాకు వివరాలు వెల్లడిరచారు. ఈ ముఠా సభ్యులు ఇంట్లో పెద్దలు లేని సమయాల్లో పిల్లలను టార్గెట్ చేస్తున్నారని, రెక్కీ చేసి చిన్నారులను అపహరిస్తున్నారని తెలిపారు. ఆగస్టు 25న లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఏడాదిన్నర

మిగతా 2లో



## నిమజ్జనానికి వెళ్లి ప్రాణాలు కోల్పోయిన తండ్రీ కుమారులు

- ఉదయం వరకూ గుర్తించలేకపోయిన స్థానికులు
- సైబరాబాద్ కమిషనరేట్ దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

వినాయక నిమజ్జనానికి వెళ్లి వెనక్కి తిప్పే క్రమంలో చెరువులో పడిన ట్రాలీ ఆటో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ విషాద ఘటన చోటుచేసుకుంది. వినాయక నిమజ్జనానికి వెళ్లిన తండ్రి, కొడుకు విగత జీవులుగా మారారు. దుండిగల్ మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం వల్లే రెండు నిండు ప్రాణాలు పోయాయని, వినాయక నిమజ్జనానికి చెరువు వద్ద కనీసం ఏర్పాట్లు చేయకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దుండిగల్ గ్రామానికి

మిగతా 2లో

## నాలుగేళ్ల స్థానికత తప్పనిసరి : సుప్రీంకోర్టు

- స్థానికత వ్యవహారంపై కీలక తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు
- 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు తెలంగాణలో చదవాల్సిందేనన్న నిబంధనకు సమర్థన
- ఇదే అంశంపై రాష్ట్ర ప్రభుత్వ జీవోను సమర్థించిన న్యాయస్థానం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణలో వైద్య విద్య చదవాలనుకునే విద్యార్థులకు నాలుగేళ్ల స్థానికత తప్పనిసరి అని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పును వెలువరించింది. ఇదే అంశంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోను ఈ సందర్భంగా సమర్థించింది. గతంలో తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి, డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులు పక్కన పెడుతూ

మిగతా 2లో





## 'కవిత వ్యాఖ్యలతో అవినీతి జరిగిందనేది స్పష్టమైంది'

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

సీఎం కేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావులు కలిసి తన తండ్రి కేసీఆర్‌పై కుట్రలు చేస్తున్నారని ఎమ్మెల్యే కవిత చేసిన వ్యాఖ్యలను పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ ఖండించారు.

మిగతా 8లో

## వెంటనే సీబీఐ విచారణకు లేఖ పంపండి

- కాళేశ్వరంపై బీజేపీ వైఖరే సరైందని రుజువైందన్న బండి సంజయ్
- బీఆర్ఎస్‌ను కాపాడేందుకే కాంగ్రెస్ చర్యలు ఆలస్యం చేసిందని ఆరోపణ

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై తమ పార్టీ బీజేపీ మొదటి నుంచి అనుసరిస్తున్న వైఖరే సరైందని మరోసారి స్పష్టమైందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఈ ప్రాజెక్టులో జరిగిన అవకతవకలకు బీఆర్ఎస్ పూర్తి బాధ్యత వహించాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఈరోజు ఆయన మాట్లాడుతూ, కాళేశ్వరం అవినీతిపై తాము మొదటి నుంచి సీబీఐ విచారణ

మిగతా 8లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# చెరువుల పరిస్థితిపై సమగ్ర అధ్యయనం చేయండి



(మొదటి పేజీ తరువాయి)

ఆ క్రమంలో ఎన్డీఆర్ఎఫ్‌తో పని లేకుండా ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిలో నైపుణ్యాలు పెంచాల్సిన ఆవశ్యకతను ఈ సందర్భంగా ఉన్నతాధికారులకు సీఎం వివరించారు. హెచ్ఎండీఏ పరిదిలో చెరువులను వెంటనే నోటిపై జరగాలని ఆదేశించారు. అయితే వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం అందజేయాలని అధికారులకు సూచించారు. అలాగే చనిపోయిన జంతువులకు సైతం పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పర్యటించాల్సిందేనని ఈ సందర్భంగా కలెక్టర్లకు స్పష్టం చేశారు. కింద స్థాయి అధికారులు కూడా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టర్లు, ఎస్పీలు జిల్లాలోనే ఉండి నిరంతరం అప్రమత్తంగా ఉండి.. పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. మరికొన్ని రోజులు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై సమగ్ర నివేదిక తయారు చేసి కేంద్రానికి అందజేయాల్సి ఉందని అధికారులకు తెలిపారు.



# తెలుగు రాష్ట్రాల ఎంపీలు ఆత్మ ప్రభోదానుసారం ఓటు వేయాలి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ఎజెండా, జెండా లేకుండా ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి అంతా మద్దతివ్వాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ స్థాయిలో తెలుగు భాష రెండో స్థానంలో ఉన్నప్పుడు తెలుగువారు కూడా ఆ స్థాయిలో ఉండాలన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంపీలు ఆత్మప్రభోదానుసారం ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలిస్తే తెలుగు వారి ప్రతిష్ట పెరుగుతుందని.. తెలుగు వారి గౌరవం పెరిగేలా .. అందరూ ఒక తాటిపైకి వచ్చి సుదర్శన్ రెడ్డి కి అండగా నిలబడాలన్నారు. సుదర్శన్ రెడ్డి పరిచయ కార్యక్రమంలో రేవంత్ మాట్లాడారు. సుదర్శన్ రెడ్డిని అభినందించేందుకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఓ నాయకుడు నక్సలైట్ అని అంటున్నారని.. నక్సలిజం ఒక విధానం మాత్రమేనని సీఎం రేవంత్ అన్నారు. నక్సలిజం ఫిలాసఫి అందరికీ నచ్చకపోవచ్చని.. మనకు నచ్చని ఫిలాసఫితో వాదించి గెలవాలి.. కాని అంతం చేస్తానంటే కుదరదని పరోక్షంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాను విమర్శించారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డికి సుదీర్ఘ అనుభవం ఉందని.. ఆయన వివిధ హోదాల్లో రాజ్యంగ స్పూర్తితో పనిచేశారని చెప్పారు. రాజ్యాంగాన్ని రక్షించే పార్టీలో ఆయన మొదటి సభ్యత్వం తీసుకున్నారని.. రాజ్యాంగాన్ని రక్షించడమే ఆయన పార్టీ అని అన్నారు. రాజ్యాంగాన్ని రక్షిస్తే దేశాన్ని రక్షించినట్లే.. లేకుంటే దేశానికి నష్టం జరుగుతుందని చెప్పారు.

పెద్దల సభ చైర్మన్ సీటులో గౌరవమైన వ్యక్తులు, అంబేద్కర్ విధానాలపైన సంపూర్ణ విశ్వాసం ఉన్నవారు కూర్చుంటే దేశానికి మంచి జరుగుతుందని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. 18 ఏళ్ల కు ఓటు హక్కు ఇచ్చిన రాజీవ్ గాంధీ ఆలోచన ఒక వైపు.. ఓట్ చోర్ ఆలోచనతో మరో పార్టీ ఇంకో వైపు ఉన్నాయని అన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని, రిజర్వేషన్లు రద్దు చేయాలని ఎన్డీఏ కూటమి.. రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని ఇండియా కూటమి ఎన్నికల బరిలోకి దిగాయని రేవంత్ వ్యాఖ్యానించారు.

# కేసీఆర్‌పై అవినీతి మరకకు హరీశ్‌రావు, సంతోష్‌రావే కారణం

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా పర్యటన నుంచి సోమవారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకున్న ఎమ్మెల్సీ కవిత.. సాయంత్రం తెలంగాణ జాగృతి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

**ఇలాగైతే పార్టీ ఎలా ముందుకు పోతుంది?**

'కేసీఆర్‌కు అవినీతి మరక అంటడానికి, ఆయనపై ఆరోపణలు రావడానికి కారకులెవరో బీఆర్ఎస్ శ్రేణులు, తెలంగాణ ప్రజలు ఆలోచించుకోవాలి. కేసీఆర్ ప్రజల కోసం ఆలోచిస్తే.. వీళ్లు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై సొంత వనరులు, ఆస్తుల కోసం ఆలోచించారు. కేసీఆర్ కాలిగోటికి సరిపోని వ్యక్తి కేసీఆర్ వైపు వేలెత్తి చూపి సీబీఐ విచారణ జరుపుతా అనేందుకు కారకులు ఎవరు? హరీశ్‌రావు, సంతోష్‌రావు నా మీద వ్యక్తిగతంగా అనేక కుట్రలు చేసినా ఇన్నాళ్లూ పేరు పెట్టి విమర్శించలేదు. కానీ ఇలాంటి వారిని మోస్తూ పోతే పార్టీ ఎలా ముందుకు పోతుంది? బీఆర్ఎస్ నాయకులకు కోపం వచ్చినా చేదు నిజాన్ని జీర్ణించుకోక తప్పదు..'అని కవిత అన్నారు.



**నన్ను విమర్శిస్తే ఖబడ్దార్!**

'హరీశ్, సంతోష్ వెనుక సీఎం రేవంత్ ఉంటూ వాళ్లను అన్ని విషయాల్లో కాపాడుతూ కేసీఆర్‌ను బదనాం చేస్తున్నారు. బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెడుతున్న అవినీతి అనకొండలను ఏమీ అనడం లేదు. అంతర్గతంగా వారి నడుమ ఉన్న అవగాహన బయటకు రావాలి. నన్ను.. బీజేపీ, కాంగ్రెస్, రేవంత్, బండి సంజయ్ నడిపిస్తున్నారని రేపటి నుంచి సోషల్ మీడియాలో విమర్శిస్తే ఖబడ్దార్.

నేను ఎవరో చెప్తే ఆడే తోలుబొమ్మను కాను. నాది కేసీఆర్ రక్తం. స్వతంత్రంగా నేను అనుకున్న విషయాలను చెప్తా. రాజకీయంగా నాకు జరిగే కష్టం, నష్టాన్ని భరించేందుకు సిద్ధం. మా నాన్నకు లేఖ రాసిన నాటి నుంచి నాకు నరకం చూపిస్తూ సోషల్ మీడియాలో ఇష్టం ఉన్నట్లు రాయిస్తున్నారు. కేసీఆర్‌పై సీబీఐ విచారణ అంటే కడుపు రగులుతోంది. అభివృద్ధి విషయంలో కేసీఆర్ నిజాం బాటలోనే నడుస్తారు.

కాళేశ్వరం ప్రాజెక్టును 200 ఏళ్ల పాటు గుర్తు పెట్టుకుంటారు. అలాంటి ప్రాజెక్టును నిర్మించిన కేసీఆర్‌పై అభాండాలు వేస్తుంటే గుండె తరుక్కుపోతోంది. మా నాన్న పరువు పోతే నాకు బాధ. కానీ మీకు మాత్రం డబ్బులు కావాలి. ఇలాంటి వ్యక్తులను దూరం పెట్టాలి. బీఆర్ఎస్ నాయకులు తిట్టుకున్నా, స్థానిక ఎన్నికల్లో నష్టం జరుగుతుందని అనుకున్నా సరే. మా నాన్న మీద సీబీఐ ఎంక్వైరీ పడిన తర్వాత పార్టీ ఉంటే ఎంత? పోతే ఎంత?

**ఇష్టారీతిన మాట్లాడితే తోలు తీస్తాం**

ఎన్నికల్లో ఒకసారి ఓడిపోతారు.. మరోసారి గెలుస్తారు. ఇలాంటి దుర్మార్గుల వల్లే ఓడిపోయే పరిస్థితి వచ్చింది. డబ్బులు, టీవీలు, సోషల్ మీడియా ఉన్నాయని ఇష్టారీతిన మాట్లాడితే తోలు తీస్తాం. కేసీఆర్‌పై పీసీ ఘోష్ కమిషన్లు, సీబీఐ విచారణలు వేస్తే తెలంగాణ బంద్‌కు పార్టీ పిలుపునివ్వాలి కదా? కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీసేందుకే సీబీఐ విచారణకు ఆదేశించారు. నేను చెప్పిన పేర్లు ఉన్న వారితో రేవంత్‌కు అవగాహన లేకపోతే వారిపై విచారణ జరపాలి. కేసీఆర్ పేరు చెప్పుకోనిదే రేవంత్‌కు పూట గడవడం లేదు. వాస్తవానికి కేసీఆర్‌కు తెలంగాణ తప్ప.. తిండి, డబ్బు ధ్యాస ఉండదు. విచారణ నుంచి కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారు.'అని కవిత పేర్కొన్నారు.

# తెలంగాణకు ఆరెంజ్ అలెర్ట్ జారీ

(మొదటి పేజీ తరువాయి)



తెలంగాణలో రాగల నాలుగురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఈశాన్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం సగటున సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని.. ఎత్తుకు వెళ్లే కొద్దీ నైరుతి వైపునకు వంగి ఉందని.. దాని ప్రభావంతో రాబోయే 24గంటల్లో ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. ఉత్తర ఒడిశా తీర ప్రాంతం, వాయువ్య బంగాళాఖాతంలో సగటున సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల విస్తరించి ఉందని.. మయన్మార్ తీరం నుంచి ఉత్తర ఒడిశా వరకు ఉన్న ద్రోణితో కలిసిపోయిందని వాతావరణశాఖ వివరించింది. ఈ క్రమంలో తెలంగాణలో సోమవారం భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, పెద్దపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆయా జిల్లాలకు ఐఎండీ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, హన్మకొండ, జగిత్యాల, కరీంనగర్, ఖమ్మం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంటూ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. మంగళవారం కొత్తగూడెం, హన్మకొండ, జగిత్యాల, భూపాలపల్లి, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు, నిర్మల్, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల, వరంగల్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. జనగాం, ఆదిలాబాద్, కామారెడ్డి, జనగాం, ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, నల్గొండ, సంగారెడ్డి, సిద్ధిపేట, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. బుధవారం కొత్తగూడెం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడుతాయని అంచనా వేసింది. ఆదిలాబాద్, హన్మకొండ, కామారెడ్డి, ఖమ్మం, ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలుంటాయని హెచ్చరించింది. ఈ నెల 4న రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, కామారెడ్డి, పెద్దపల్లి, మంచిర్యాల, వరంగల్, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ములుగు జిల్లా ఏటూరునాగారంలో 11.7, కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో 15, కొత్తగూడెంలో 19.2, నాగుపల్లెలో 12, మహమూబాబాద్ జిల్లా భూపతిపేటలో 11.9 సెంటీమీటర్ల భారీ వర్షపాతం రికార్డయ్యిందని టీజీ డీపీఎస్ వివరించింది.

# పిల్లల్ని ఎత్తుకెళ్లే ముఠా అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

వయసున్న చిన్నారిని ఈ ముఠా సభ్యులు కిడ్నాప్ చేశారు. కాచిగూడలో ఐదేళ్ల బాలికను, లింగంపల్లిలో మరో బాలికను కూడా ఎత్తుకుపోయారు. గత ఏడాది కూడా ఐదేళ్ల బాబును కిడ్నాప్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో మొత్తం నలుగురు చిన్నారులను(ఇద్దరు బాలికలు, ఇద్దరు బాలురు) రెస్క్యూ చేశారు. పిల్లలను ఎత్తుకెళ్లింది దత్తత పేరుతోనా? లేక ఇతర ప్రాంతాలకు విక్రయం చేయాలనే ఇంటెన్షనా.. అన్నదానిపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. దీని వెనక పెద్ద ముఠా ఉందా అనే కోణంలోనూ విచారణ జరుపుతున్నాయి. ఇటీవల మీ బంధువుల్లో, పరిచయస్తుల్లో ఎవరైనా చిన్నారులు కనిపించకుండా పోయి ఉంటే, తక్షణమే మీ స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు సూచించారు. పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.



# నిమజ్జనానికి వెళ్లి ప్రాణాలు కోల్పోయిన తండ్రీ కుమారులు

(మొదటి పేజీ తరువాయి)



చెందిన శ్రీనివాస్ ట్రాలీ ఆటోలో కూరగాయలు అమ్ముకుంటూ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శ్రీనివాస్‌కు 8 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. అతనికి ముగ్గురు సంతానం. కాగా అందులో పెద్ద కుమారుడు జాన్ వెస్లి. ఆదివారం రాత్రి వినాయక నిమజ్జనానం కోసం విగ్రహాన్ని తరలించేందుకు కిరాయి మాట్లాడుకున్నారు. ఈ నిమజ్జనానికి తనతో పాటు తన కుమారుడు జాన్ వెస్లీని కూడా తీసుకువెళ్లాడు. రాత్రి దుండిగల్ మోతి చెరువులో నిమజ్జనం చేసి ఆటోను వెనక్కి తిప్పే క్రమంలో ఆటో ప్రమాదవసాత్తు చెరువులోకి దూసుకెళ్లింది. ఆటో కనిపించకపోయేసరికి అందరూ ఇంటికి వెళ్లిపోయారని అనుకుని ఊరికి వెళ్లారు. ఉదయం కావస్తున్నా తండ్రీ కుమారులు ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కల వారికి అనుమానం వచ్చింది. దీంతో వారు చెరువు వద్దకి వెళ్లి చూడగా వారికి ఎవరూ కనిపించకపోవడంతో ఆటో చెరువులోనే పడిపోయినట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు, డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చెరువులో 3 గంటలు గాలింపు చర్యలు చేపట్టారు. చివరిగా ఆటోను బయటకు తీశారు. ఈ ఆటోలో శ్రీనివాస్ (35), అతని కుమారుడు జాన్ వెస్లీ (7) విగత జీవులై కనిపించారు. ప్రమాదం జరిగే సమయంలో ఆటో డోర్ తెరుచుకోకపోవడం కారణంగా నీటిలో మునిగి, ఊపిరి ఆడక ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు నిర్ధారించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృత దేహాలను పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

# నాలుగేళ్ల స్థానికత తప్పనిసరి : సుప్రీంకోర్టు

(మొదటి పేజీ తరువాయి)



జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ మేరకు తీర్పును వెలువరించింది. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు కచ్చితంగా తెలంగాణలో చదవాల్సిందేనన్న నిబంధనను సుప్రీంకోర్టు సమర్థించింది. వైద్య విద్యలో స్థానిక కోటా కింద ప్రవేశాలు పొందాలనుకున్న విద్యార్థులు నీట్ రాయడానికి ముందు నాలుగేళ్లు వరుసగా తెలంగాణలో చదివి ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. గతంలోనే దీనిపై విద్యార్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, నిబంధనలను తప్పుబడుతూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం నేరుగా సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసు విచారణను చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విక్రమ్‌చంద్రన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. గత నెల ఆగస్టు 5న వాదనలను విన్న అనంతరం విచారణను ముగిస్తున్నట్లు తెలిపిన న్యాయస్థానం, ఇంకేమైనా వాదనలుంటే ఆగస్టు 8లోపు లిఖితపూర్వకంగా సమర్పించాలని ఆదేశించింది. స్థానికత సమస్యకు ప్రభుత్వమే పరిష్కార మార్గాలను చూపాలని, లేదంటే పిటిషన్‌ను డిస్మిస్ చేస్తామని చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా గవాయ్ జులై 23న విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్‌శంకర్ నారాయణన్ పరిష్కార మార్గాలు చెప్పకుండా తాము వాదనలు వినిపించాలనుకుంటున్నట్లు న్యాయస్థానానికి చెప్పారు. దాంతో ఈ పిటిషన్‌పై విచారణను ముగించి తెలంగాణ శాశ్వత నివాసులైన విద్యార్థులు ఇంటర్ పరీక్షలను తెలంగాణలో రాయకపోయినా ఎంబీబీఎస్ అడ్మిషన్?లకు అనుమతివ్వాలని మధ్యంతర ఉత్తర్వులను జారీ చేయడానికి సీజేఐ సిద్ధమయ్యారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ న్యాయస్థానం అలాంటి ఉత్తర్వులు జారీ చేయడానికి ముందు తమ వాదనలు వినాలని అభ్యర్థించారు. అందుకు అంగీకరించిన సీజేఐ సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలను పరిగణలోనికి తీసుకున్నారు





# గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పిల్లలతో తల్లిదండ్రుల పాదపూజ నిర్వహణ

## కుటుంబ విలువలు భారతీయ సంప్రదాయాల ప్రాధాన్యం పై అవగాహన కల్పన

**కుషాయిగూడ, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** కుషాయిగూడలోని శ్రీ శివాంజనేయ దేవస్థానంలో సోమవారం ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ నియోజకవర్గ కన్వీనర్ చల్లా ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.గణనాథుని మండపంలో చిన్నారులతో కలిసి తల్లిదండ్రులకు పాదపూజ చేయించడం ఈ కార్యక్రమం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కుటుంబ విలువలు, భారతీయ సాంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయాలనే లక్ష్యంతో ఈ పాదపూజ యజ్ఞం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భానికి విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రావినూతల శశిధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ: "పిల్లలకు చిన్నప్పటి నుంచే మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడం చాలా ముఖ్యం. తల్లిదండ్రుల పాదపూజ ఒక సాధారణ కార్యక్రమం కాదు, ఇది మహా యజ్ఞం. ఇలాంటి కార్యక్రమాలు మన కుటుంబ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాయి" అని అన్నారు. కేంద్ర కమిటీ కార్యదర్శులు నయని బుచ్చిరెడ్డి, ఆలె భాస్కర్, ఇతర ప్రముఖులు కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్ల ఆనంద్, రేగొండ వెంకులు, గణేష్ ముదిరాజ్, గోపాల్, సోమయ్య నాయుడు, సందీప్ యాదవ్, దేవేందర్, బాలకృష్ణ, భరత్ కుమార్, బండారి అనిల్, బండారి పవన్, శ్రీకాంత్ వంశి రాజ్ తదితరులు పాల్గొని గణనాధుని ఆశీస్సులు పొందారు.




# కాకర్లపల్లి కష్టాలు వినకపోతే ఎలా, సీపీఎం ఆగ్రహ ధర్నా!

**సత్తుపల్లి, సెప్టెంబర్ 01(తెలంగాణ ముచ్చట్లు):** కాకర్లపల్లి గ్రామ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సత్తుపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆగ్రహ ధర్నా జరిగింది. గ్రామ ప్రజల తరఫున వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు.

వేపులపాటి కుమారస్వామి అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ, కాకర్లపల్లి సమీపంలోని ఎన్టీఆర్ పాత కాలువ వృథాగా పడి ఉందని, దానిని సింగరేణి మట్టితో పూడ్చి అర్హులైన పేదలకు గృహ స్థలాలు కేటాయించాలని అన్నారు. సుమారు 125 కుటుంబాలకు ఇళ్లు లేక, ఒకే గదిలో గజిబిజిగా జీవిస్తున్నారని, ఇది అధికారుల నిర్లక్ష్యం కాకపోతే మరేమిటని ప్రశ్నించారు.

అలాగే అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు, ఆసరా పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు తక్షణమే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల అమలులో రాజకీయ జోక్యం అరికట్టాలని హెచ్చరించారు. ప్రజల సమస్యలు పట్టించుకోకపోతే పోరాటాన్ని మరింత ముమ్మరం చేస్తామని జాజిరి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

ఈ ధర్నాలో పార్టీ మండల కార్యదర్శి జాజిరి జ్యోతి, సీనియర్ నాయకులు బాల బుచ్చయ్య, గ్రామ శాఖ కార్యదర్శి బండి వేలాద్రి, మండల కమిటీ సభ్యులు అయినంపూడి సనంధరావు, హసావత్ కృష్ణ, కాపూరి వెంకటేశ్వరరావు, బెజవాడ లక్ష్మీనారాయణ, ఆంగోటి చిట్టెమ్మ, రమాదేవి, తిరుపతి అజయ్, వేంపాటి కృష్ణయ్య, పరిమి సీతామహాలక్ష్మి, కోవాకుల పరమేష్, రాజేశ్వరి, ఫరీదా, గాలిబీ తదితరులు పాల్గొన్నారు.







# ప్రవక్త బోధనలకు అనుగుణంగా జీవితం గడపాలి

## జె ఐ హెచ్ రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ అజాహరుద్దిన్

**ఖమ్మం బ్యూరో,సెప్టెంబర్ 1, తెలంగాణ ముచ్చట్లు;** ప్రవక్త మొహమ్మద్( సల్లల్లాహు సల్లం) ప్రవచనాలను అనుసరించి మనిషి వ్యక్తిగత , సామాజిక జీవితాలను చక్కదిద్దుకోవాలని జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా మొహమ్మద్ అజాహరుద్దిన్ అన్నారు. జమాఅతె ఇస్లామి హింద్ సెప్టెంబర్ 1 నుండి 15 వరకు మొహమ్మద్ ప్రవక్త (సఅసం) అందరు కోసం ప్రచార ఉద్యమంలో బాగంగా జమాఅతె ఇస్లామి హింద్ ఆదివారం కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మనిషి ప్రాపంచిక జీవితం ఒక పరీక్షా వ్యవస్థ ఇక్కడ చేసే ప్రతి పనిని దైవం వద్ద జవాబు చెప్పుకోవాల్సి ఉంది ఎవరైతే ప్రవక్త బోధనలకు అనుగుణంగా జీవిస్తాడో శాశ్వత స్వర్గానికి వాటికి భిన్నంగా జీవించిన వ్యక్తి నరకానికి పాత్రుడవుతాడు అన్నారు. మనిషి ఎల్లప్పుడు దైవనికి భయపడుతూ జీవితం గడిపినపుడే. ఇహపరలోకాల్లో సాఫల్యం పొందుతాడన్నారు. ఈ జీవితం అశాశ్వతమైనదని , అసలు జీవితం పరలోక జీవితమని అక్కడ సాఫల్యమే నిజమైన సాపల్యమన్నారు. ఇహపర లోకాల్లో సుఖశాంతులు సంతృప్తి. సాఫల్యాలు పొందాలంటే మనిషి యొక్క సామాజిక జీవితం, కుటంబం జీవితం ఆచార వ్యవహరాలు, ప్రవర్తన, ఆర్థిక లావాదేవీలు ప్రతి ఒక్కటి ఖుర్‌ఆన్ ఆదేశాలు మరియు అంతిమ దైవ ప్రవక్త మొహమ్మద్. (సఅసం) బోధనలకు అనుగుణంగా జీవితం గడపాలన్నారు. ఉత్తమ సమాజం సామాజిక రుగ్మతులను రూపుమామటానికి ఇహ పర లోకాల సాఫల్యం కోసం ప్రవక్త మొహమ్మద్. (సఅసం) బోధనలు ఎంతో దోహదపడతాయని చెప్పారు ఆయన అందరివాడు అని కేవలం ఒక వర్గానికే కాకుండా సమస్త మానవాళికి మార్గదర్శకంగా పంపబడ్డారని అన్నారు

అనంతరం జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర సలహా మండలి సభ్యులు సాధిక్ అహ్మద్ మాట్లాడుతూ మానవులందరూ ఒకే చోట జీవిన మనుగడ సాగించినప్పుడు ఒకరికొకరు సోదర సోదరీమణలు పరస్పరం గౌరవించుకున్నప్పుడు సమాజంలో శాంతి సామరస్యాలు పెంపొందుతాయన్నారు.

పోస్టర్ విడుదల అనంతరం జమాతే ఇస్లామీ హింద్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించే మొహమ్మద్ ప్రవక్త (సఅసం) అందరు కోసం ప్రచార ఉద్యమం పోస్టర్ ను జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా మొహమ్మద్ అజాహరుద్దిన్, రాష్ట్ర సలహా మండలి సభ్యులు సాధిక్ అహ్మద్ విడుదల చేయడం జరిగింది. ఈ కార్యాక్రమములో జిల్లా అధ్యక్షులు జైనుల్ పాషా ఉపాధ్యక్షులు అబ్దుల్ సమి, సెంట్రల్ అధ్యక్షులు ఇంతియాజ్ , నార్త్ అధ్యక్షులు మొహమ్మద్ యూసుఫ్ షరీఫ్, సౌత్ అధ్యక్షులు సయ్యద్ నిజాముద్దీన్, వెస్ట్ అధ్యక్షులు అబ్దుస్ సుబుర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు అస్మా అన్జుమ్,ఉపాధ్యక్షురాలు సమీనా, సెంట్రల్ అధ్యక్షురాలు అస్ఫియ అన్జుమ్ , నార్త్ అధ్యక్షురాలు హుస్సేన్ బి , సౌత్ అధ్యక్షురాలు నాజియా తబస్సుం ,వెస్ట్ అధ్యక్షురాలు ఫర్జానా , ఐట రీజినల్ సెక్రెటరీ మొహమ్మద్ ముజీబ్, జిల్లా మీడియా సెక్రెటరీ అబ్దుల్ మలిక్, యంపీజే జిల్లా అధ్యక్షులు ఖాసిం సభ్యులు షెక్ లతీఫ్ ,అక్బర్ మూసా ,ఖలిల్ అహ్మద్ ఖాన్ , జమీల్ అహ్మద్ ఖాన్, అబ్దుల్ రహీం, మదార్, సఫ్దర్ ఖాన్, గౌస్, అబ్దుల్ రజాక్, ఫయాజ్ .షేక్ హసన్ మియా ,షెక్ ఇలియాస్, షెక్ మలిక్, హాది, షెక్ లతీఫ్ , ఏజాస్, జహిరా , నస్రీన్ , నసీమున్నిసా , ఫైజా ఇరమ్ , రాఫిఖా, ఉమ్మె హబీబా, అఫ్‌రోజ్, హాజిరా, నూరీ అఫ్స ,షాజియా, ఫర్జానా, సీమా , సల్మ అఫ్రోజ్, అర్శియ ,నూర్జహన్, షభానా తదితరులు పాల్గొన్నారు



# ఉప్పల్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ డివిజన్ పరిధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పలు మండపాలను సందర్శించి భక్తిశ్రద్ధలతో గణనాథుని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మండప నిర్వాహకులతో సన్నిహితంగా మాట్లాడారు.రాఘవేంద్ర కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించిన రజిత పరమేశ్వర్ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో సైతం పాల్గొన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రజల ఐక్యతకు, భక్తి భావనకు ప్రతీకలని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, "విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి కృపతో ఉప్పల్ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మనసారా కోరుకుంటున్నాను. ఈ ఉత్సవాల ద్వారా సమాజంలో ఐక్యతా స్ఫూర్తి పెంపొందుతుంది" అని రజిత పరమేశ్వర్ రెడ్డి అన్నారు. ఉత్సవాల్లో భాగంగా పలు కాలనీల్లో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు, పూజా కర్మకాండాలను ఆమె అభినందించారు. ఉత్సవాలకు సహకరిస్తున్న స్థానికులు, కమిటీ సభ్యుల కృషిని ప్రశంసించారు .ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర కాలనీ సభ్యులు, వినాయక మండప నిర్వాహకులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.





# అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 1, తెలంగాణ ముచ్చట్లు:**

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పోలీస్ ఫ్యామిలీ క్వార్టర్స్ లో పోలీస్ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసుకున్న అన్నదాన కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రారంభించారు. ముందుగా పోలీస్ కుటుంబాలు ఏర్పాటు చేసుకున్న గణేష్ మండపంలోని స్వామి వారని దర్శించిన పోలీస్ అధికారులు పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ పోలీసు సిబ్బందికి, పోలీస్ కుటుంబాలకు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో అడిషనల్ ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి, టౌన్ ఏసీపీ రమణమూర్తి, రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, ఎస్బి ఏసీపీ మహేష్, ఏ ఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, సిఐలు రాజిరెడ్డి, కరుణాకర్, రామకృష్ణ, ఆర్ ఐలు కామరాజు, శ్రీశైలం, సాంబశివరావు, సురేష్ పాల్గొన్నారు.



# గణనాథునికి నిమజ్జన వేడుకలు వైభవంగా

## అక్షిత అపార్ట్‌మెంట్‌లో నూతన కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు

**మల్కాజ్గిరి, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి పరిధిలోని అక్షిత అపార్ట్‌మెంట్‌లో కొత్తగా ఏర్పాటైన కమిటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు తొలిసారిగా గణనాథుడికి పూజా కార్యక్రమాలు నిర్వహించడం విశేషం.ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ అపార్ట్‌మెంట్ వాసులు, పిల్లలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించారు. భక్తి గీతాలతో, శ్లోకాలతో గణనాథుడి ఆశీస్సులు కోరుకున్నారు. పండుగ చివరిరోజున సంప్రదాయబద్ధంగా లడ్డూ ప్రసాదం పంపిణీ చేసి, పెద్ద సంఖ్యలో నివాసులు నిమజ్జన యాత్రలో పాల్గొన్నారు.అలంకరించిన వాహనంపై గణనాథుని విగ్రహాన్ని ఊరేగిస్తూ నిమజ్జన ఘాట్ వద్ద అంగరంగ వైభవంగా నిమజ్జన చేశారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ ప్రాంగణం మొత్తం విద్యుద్దీపాలతో, పూలతో అందంగా అలంకరించారు.

కమిటీ సభ్యులు సాయి కిరణ్ దంపతులు, సప్న సాయి కిరణ్, సుబ్రహ్మణ్యం సెట్టి, విశాల్, మహేష్‌తో పాటు నివాసులంతా కలసి ఉత్సవాలను విజయవంతం చేశారు.






# ఆర్టిసి పరిరక్షణకు పోరాటమే మార్గం

## ఎంప్లాయీస్ యూనియన్ సభలో దండి సురేష్

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 1, తెలంగాణ ముచ్చట్లు ;** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఒక గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటుందని అస్తిత్వమే ప్రమాదంలో పడిందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ఆర్టిసి పరిరక్షణకు హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఆర్టిసి ప్రైవేటీకరణ దిశగా ఆలోచన చేయడం శోచనీయమన్నారు. ఆర్టిసి ఎంప్లాయీస్ యూనియన్ ఖమ్మం డిపో కమిటీ సమావేశం సోమవారం స్థానిక గిరిప్రసాద్ భవన్లో జరిగింది. పిల్లి రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో దండి సురేష్ మాట్లాడుతూ ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో క్రమేపి ప్రైవేటీకరణకు అవకాశం కల్పిస్తుందని ఇప్పటికే కొన్ని డిపోలను ప్రైవేటు సంస్థలకు అప్పగించారన్నారు. ఆర్టిసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామన్న ప్రభుత్వం ఇప్పుడు ఆ ఊసెత్తడం లేదని, ఆర్టిసి కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బకాయిలు, డిఏ, ఇతర ఆర్థిక విషయాలకు సంబంధించి ప్రభుత్వం తక్షణం పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్టిసిలో ఎన్నడులేనివిధంగా వేధింపుల పర్వం ప్రారంభమైందని కార్మికులను వేధిస్తే సహించబోమన్నారు. ఆర్టిసి ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పోరాటాలకు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు బిఎస్డి, డిపో అధ్యక్షులు జగన్నాథం, కార్యదర్శి బుచ్చిబాబు, డిపో ఛైర్మన్ సిహెచ్ రమేష్, డిపో కోశాధికారి వెంకన్న, నాయకులు ఆదిలక్ష్మి, సుల్తానా, రమాదేవి, నాగమణి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు దండి సురేష్ను ఘనంగా సన్మానించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: పొట్లపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## రాష్ట్ర అధ్యక్షులను మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నాయకులు


**వనపర్తి,సెప్టెంబర్01(తెలంగాణ ముచ్చట్లు):**
భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు ను రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకలాపాలపై విస్తృతంగా చర్చ జరిగింది.
కార్యక్రమంలో ఎగ్గని నరసింహ , రాష్ట్ర సీనియర్ నాయకులు సుదర్శన్ రెడ్డి , పడకాల బాలరాజు, పాల్గొన్నారు. పార్టీకి అంకితభావంతో పనిచేస్తున్న సీనియర్ నాయకులు, కార్యకర్తలు కూడా ఈ సమావేశంలో హాజరయ్యారు.
అదే విధంగా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామానికి చెందిన రమేష్ కూడా రాష్ట్ర అధ్యక్షులను మర్యాదపూర్వకంగా కలిసారు.



## అంగన్వాడి కేంద్రంలో పోషకాహార వారోత్సవాలు

- అందరూ ఆరోగ్యంగా ఉన్నప్పడే దేశం అభివృద్ధి చెందుతుంది
- అంగన్వాడి టీచర్ రమాదేవి

**వనపర్తి,సెప్టెంబర్01(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల గ్రామంలోనీ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు, 0 నుంచి 5 సంవత్సరాల చిన్నారులు, 15 నుంచి 45 సంవత్సరాల మహిళలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్ రమాదేవి మాట్లాడుతూ, మహిళలు రక్తహీనతకు ఎక్కువగా గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల పోషకాలు సమృద్ధిగా లభించే ఆహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. "ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే భారతదేశం అభివృద్ధి సాధిస్తుంది" అని రమాదేవి అన్నారు.



## ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు సురవరం

**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**వనపర్తి,సెప్టెంబర్01(తెలంగాణ ముచ్చట్లు):** కంచుపాడు గ్రామంలో సి.పి.ఐ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ ఘనంగా జరిగింది. ఈ సభలో ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సురవరం ప్రజా సేవలను స్మరించుకున్నారు.
ఆయన మాట్లాడుతూ - సుధాకర్ రెడ్డి తాను నమ్ముకున్న సిద్ధాంతాల కోసం జీవితాంతం ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడారని, ఆ పోరాట ఫలితంగా అనేక ప్రజా విజయాలు సాధించారని తెలిపారు. జాతీయ స్థాయిలో ఎదిగి మన జిల్లాకు విశేష గౌరవం తీసుకొచ్చారని ఆయన పేర్కొన్నారు.
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన ఉద్యమం, రాష్ట్ర ఏర్పాటులో ఆయన పోషించిన కీలక పాత్రను నిరంజన్ రెడ్డి గుర్తుచేశారు. కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాల ఆధారంగా రాజ్యస్థాపన జరగాలని ఆయన కలలు కనారని, ఈ దేశంలో కమ్యూనిస్టు పార్టీలు ఉన్నంతకాలం సుధాకర్ రెడ్డి చిరస్మరణీయులుగానే నిలుస్తారని ఆయన అన్నారు.

## మాజీ సర్పంచ్ భబిచంద్ మృతి పట్ల మాజీ ఎంపీ నామ సంతాపం

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 1, తెలంగాణ ముచ్చట్లు:**



రఘునాథపాలెం మండలం, లచ్చిరాం తండా మాజీ సర్పంచ్ భబిచంద్ మృతి పట్ల బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వర రావు సంతాపం తెలిపారు. భబిచంద్ మృతి వారి కుటుంబానికి, బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి కృషి చేసిన భబిచంద్ సేవలు మరువలేనివని అన్నారు. ప్రజలతో కలిసిమెలిసి పనిచేసిన నాయకుడిగా ఆయన గుర్తుండిపోతారని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడూ ముందుండేవారని అన్నారు. భబిచంద్ మరణం బాధాకరమని వారి కుటుంబానికి నామ నాగేశ్వరరావు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యం కలిగించాలని ప్రార్థించారు.





# సమాజానికి కరుణ ప్రేమ సేవా తత్పరతను వారసత్వంగా వదిలి, తరలిన గియాసోద్దీన్ బాబు ఖాన్

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 1, తెలంగాణ ముచ్చట్లు;**
సమాజానికి కరుణ ప్రేమ సేవ తత్పరతను తన వారసత్వంగా వదిలేసి , శాశ్వతంగా గియాసుద్దీన్ బాబు ఖాన్ తరలి వెళ్ళిపోయారు. పరోప కారార్థం ఇదం శరీరం అనే పెద్దల ఉవాచన ను అక్షరాల తన జీవితంలో ఆచరించిన మహానుభావుడు గియాసుద్దీన్ బాబు ఖాన్ . ఇటీవల ఆయన మృతి చెందారు.
హైదరాబాద్:కు చెందిన ప్రముఖ పరోపకారి , వ్యాపారవేత్త గియాసుద్దీన్ బాబుఖాన్ భౌతికకాయానికి బంజారా హిల్స్‌లోని మసీద్ఎబాఖీలో సోమవారం (ఆగస్టు 25, 2025) అంత్యక్రియలు నిర్వహించారు. పౌరులు, పరోపకారులు, కమ్యూనిటీ నాయకులు, ఆయన చేపట్టిన ఛారిటీ కార్యక్రమాల లబ్ధిదారులు.... వేల సంఖ్యలో తరలివచ్చి గియాసుద్దీన్ బాబుఖాన్‌కు నివాళులర్పించారు.
"గియాసుద్దీన్ బాబుఖాన్ మరణం హైదరాబాద్‌కు తీరని లోటు. పేదలకు విద్య అందించడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయం" అని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ట్వీట్ చేశారు.
హైదరాబాద్‌లోని సుప్రసిద్ధ కుటుంబాల్లో ఒకటైన బాబుఖాన్ కుటుంబంలో జన్మించిన గియాసుద్దీన్, తాను వారసత్వంగా పొందిన సేవా భావాన్ని ముందుకు తీసుకెళ్లడమే కాకుండా దానిని మించిపోయారు. ఆయన తండ్రి, ఖాన్ బహదూర్ అబ్దుల్ కరీం బాబుఖాన్ తల్లి షెహజాది బేగం, హైదరాబాద్ కీర్తిని మరింత గుర్తింపు ఇముడించడంలో సహాయపడిన వంశానికి చెందినవారు.
1993లో, ఆయన హైదరాబాద్ జకాత్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్‌ను స్థాపించారు, ఇది వేలాది కుటుంబాల చదువులకు అనంతరం ఉపాధి అవకాశాల పుట్టగా మారింది. మారుమూల గ్రామాల్లోని పాఠశాలల ద్వారా, పట్టణ మురికివాడల్లోని ఆంగ్ల మాధ్యమ సంస్థల ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల ద్వారా, ట్రస్ట్ విద్యకు అందుబాటు లేని పిల్లల కోసం నీడగా, ఆసరాగా, ఆశగా నిలిచింది. దీని సోదర సంస్థ అయిన ఫీడ్ వేలాది మంది విద్యార్థులకు అవకాశాలను కల్పించింది, వారు ఈ రోజు గియాసుద్దీన్ సృష్టించిన అవకాశాల వల్లే తమ కు జీవితంలో విజయం లభించిందని చెబుతారు.
ఆయన వేలాది పేద విద్యార్థులు, ప్రతిభావంతులు ఉన్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించి, ఉన్నత విద్యను కొనసాగించే అవకాశం కల్పించారు. తన 32 ఏళ్ల దాతృత్వ సేవల్లో ఆయన లక్షలాది పేదలకు ఆర్థిక సహాయం చేశారు.
అతని దృష్టిలో, ఛారిటీ అనేది సామాజిక సాధికారత అంశం.
గియాసుద్దీన్ ఛారిటీని కేవలం సహాయంగా చూడలేదు —— ఆయన దానిని సాధికారతగా చూశారు. ఆయన పేదలను మాత్రమే కాకుండా, ఎక్కువగా పట్టించుకోని వారిని కూడా పట్టించుకున్నారు: వితంతువులు, అనాథలు, గొంతులేని కుటుంబాలు. ఆయన మార్గదర్శకత్వంలో తమ జీవితాలను తీర్చిదిద్దుకున్నారు.ట్రస్ట్ ఒక వితంతు పునర్వివాహ కార్యక్రమాన్ని ప్రారంభించి, మహిళలు గౌరవంగా తమ జీవితాలను తిరిగి నిర్మించుకోవడానికి సహాయపడింది. ప్రభుత్వసహాయక వివాహ పథకం "షాదీ ముబారక్"ను సూచించినది కూడా గియాసుద్దీనే, ఇది కూడా ఆయన కార్యక్రమాల నుండి ప్రేరణ పొందింది. ఆయన ఒక బిల్డర్ కూడా. బాబుఖాన్ ప్రాపర్టీస్ అండ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్‌గా, ఆయన దక్కన్ టవర్స్ బాబుఖాన్ ఎస్టేట్ వంటి ప్రాజెక్టులతో హైదరాబాద్ స్కైలైన్‌ను మార్చే తన కుటుంబ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, రాష్ట్ర అభివృద్ధికి మద్దతుగా డ్యామ్‌లు, వంతెనలు, పరిశ్రమల నిర్మాణానికి కూడా సహకరించారు. ఆయన గురించి ప్రజలను అడిగితే, వారు ముందుగా భవనాలు లేదా సంస్థల గురించి మాట్లాడరు. ఆయన వినే విధానం, ఆయన చూపే శ్రద్ధ , పలకరించే విధానం, ఆయన ప్రతి విద్యార్థి, వితంతువు, లేదా తన వద్దకు వచ్చిన ప్రతి కుటుంబాన్ని ఒక వ్యక్తిగా, గౌరవానికి అర్హుడిగా..... కరుణతో ప్రేమతో సేవా తత్పరతతో మసలే ... ఇది విధానాల పై మాట్లాడుతారు. ఆయన కరుణను ఆచరణలో చూపారు.
ఆయన సంతానం
గియాసుద్దీన్‌కు ఆయన భార్య, షుజాత్ బాబుఖాన్, పిల్లలు - మోహ్సిన్, అస్రా, మన్సూర్, ముస్తఫా - ఉన్నారు, వీరిలో ప్రతి ఒక్కరూ వ్యాపారంలో , సేవలో ఆయన దార్శనికతను ముందుకు తీసుకు వెళుతున్నారు. ఆయన తన బేగంపేటలోని గొప్ప బంగ్లాను ఛారిటీకి అంకితం చేస్తానని ప్రకటించారు. ఆయన వేరే ఇంటికి మారిన రోజు నుండి ఆ ఇంటికి అద్దె చెల్లించడం కొనసాగించారు. ఇది ఆయన వ్యక్తిత్వాన్ని .... అనేక సుగుణాలలో ఇది ఒకటి. ఇంకా లెక్కలేనన్ని ఉన్నాయి, కానీ ఆయన అనేక సహాయ , సామాజిక పునరావాస ప్రాజెక్టులు నిరుపేదలపై లేదా ప్రకృతి వైపరీత్యాలు ,మత ఘర్షణల వల్ల ప్రభావితమైన వారిపై చూపిన నిర్మాణాత్మక ప్రభావం సాటిలేనిది. సంపద తరచుగా దాచుకునే ఈ ప్రపంచంలో, నిజమైన సంపద ఇవ్వడంలో ఉందని ఆయన ఆచరణలో చూపారు. ఆయన జీవితం దాతృత్వపు పందిరి, దాని నీడలో లెక్కలేనన్ని జీవితాలు ఆశ్రయాన్ని పొందాయి. ఆయన లేని లోటు తీవ్రంగా ఉంటుంది, కానీ ఆయన మూలాలు సంస్థలలో, కమ్యూనిటీలలో, ఆయన జీవితాలను తాకిన ప్రతి ఒక్కరి హృదయాలలో లోతుగా పాతుకుపోయాయి.
హైదరాబాద్ జకాత్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్ .... గియాసుద్దీన్ బాబుఖాన్ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. సేవల పరిధి విస్తరించింది. పేద, అర్హులైన, ప్రతిభావంతులైన విద్యార్థులను ఆయన వెతికి పట్టుకుని వారి ప్రతిభను ప్రోత్సహించారు. ఎలాగైతే ఒక రాయిని చెక్కి వజ్రంగా మార్చుతారో, అదేవిధంగా ఆయన విద్యార్థులను తీర్చిదిద్దారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పల్లెపల్లెల్లో గుడిసెల్లో, మురికివాడల్లో, వర్షంలో కారుతున్న పెంకుటిళ్ళలో నివసించే ప్రతిభావంతులైన పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇచ్చి ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం కల్పించిన ఘనత గియాసుద్దీన్ బాబుఖాన్ కు దక్కుతుంది. దీనితో వారి తల్లిదండ్రులు కలలో కూడా ఊహించని వారి కలలు నెరవేరాయి. ఎంబీబీఎస్, ఇంజనీరింగ్, ఎంబీఏ మరియు ఇతర వృత్తి విద్యా కోర్సుల్లో చేరాలనుకునే ప్రతిభావంతులైన విద్యార్థులకు గియాస్ సాహిబ్ ట్రస్ట్ సహాయం చేసింది. ఈ విద్యార్థులలో చాలామంది ఇప్పుడు సమాజానికి ఆస్తిగా మారారు. వారిలో కొందరు ఇంజనీరింగ్ కోర్సులో నాలుగు సంవత్సరాలు స్కాలర్‌షిప్ పొంది, తర్వాత సొంత విద్యా సంస్థలను స్థాపించారు. ఈ పిల్లల పురోగతి, విజయాన్ని చూసి గియాస్ సాహిబ్ తన సొంత పిల్లలు విజయం సాధించినంతగా సంతోషపడేవారు.
అనాథలు ,వితంతువుల పట్ల ఆయనకు ఉన్న సానుభూతి, వారి కోసం ఆయన పడిన తపన నిజమైన ముస్లిం లక్షణాలు. అనాథ పిల్లలు గియాస్ సాహిబ్‌ను చూస్తే, తమకు దూరమైన తండ్రి తిరిగి వచ్చినట్లుగా సంతోషపడేవారు. యువ వితంతువుల వివాహాలను ప్రోత్సహించడం అనేది నిరాశ్రయులైన మహిళలకు పునరావాసం కల్పించడమే కాకుండా సమాజాన్ని చెడు మార్గం నుండి కాపాడటానికి ఒక గొప్ప పోరాటం.హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ ను ఆయన స్థాపించారు. ఇది నిస్సందేహంగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అసాధారణ విద్యా ప్రాంగణం. ఇక్కడి నుంచి ఇంటర్ చదివిన విద్యార్థులు చాలామంది డాక్టర్లు మరియు ఇంజనీర్లు అయ్యారు. గియాస్ సాహిబ్ హైదరాబాద్ జకాత్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్, జీబీకే ట్రస్ట్ , ఫీడ్ తరపున చాలా పాఠశాలలను స్థాపించారు. చాలా పాఠశాలలకు ఆర్థిక సహాయం అందించారు. వాటిలో చాలావరకు రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఆయన స్ఫూర్తితోనే తెలంగాణలో మైనారిటీల రెసిడెన్షియల్ పాఠశాలలు స్థాపించబడ్డాయి.
వైఎస్ఆర్ గియాసుద్దీన్ బాబుఖాన్‌కు 'ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్' ప్రభుత్వ అవార్డును ఇచ్చి సత్కరించారు. అంతేకాకుండా, 2014లో తెలంగాణ ప్రభుత్వం మౌలానా అబుల్ కలాం ఆజాద్ నేషనల్ అవార్డును కూడా ప్రదానం చేసింది.





# బస్సు ఢీకొని భార్య మృతి రక్తస్రావంలో విలవిల్లాడిన భర్త

**గాయపడిన బాధితుడిని స్వయంగా ఆసుపత్రికి చేర్చిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 1, తెలంగాణ ముచ్చట్లు:**
ఒక క్షణం ఆలస్యం, ఒక వాహన నిర్లక్ష్యం - ఒక చిన్న కుటుంబాన్నే శోకసంద్రంలో ముంచింది. ఆదివారం సాయంత్రం రంగనాథపాలెం మండలం వెంకటాయపాలెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం భయంకర దృశ్యాలకు వేదిక అయింది. ఏన్కూర్ మండలం కేసుపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు తన భార్య లక్ష్మితో కలిసి టూవీలర్‌పై స్వగ్రామానికి బయల్దేరారు. అయితే వెనకనుంచి అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో కుటుంబం జీవితాలు క్షణాల్లో మారిపోయాయి. బస్సు టైరుకింద కొట్టుకుపోయిన లక్ష్మి అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. రక్తపు మడుగులో విలవిల్లాడుతూ పడిన వెంకటేశ్వర్లు, కళ్ల ముందే శ్వాస ఆపేసిన తన భార్యను చూసి వేదనతో కేకలు వేస్తూ కన్నీటి భరితంలో మునిగిపోయారు. ఆ దృశ్యం చూసిన ప్రత్యక్ష సాక్షులు సైతం క్షణం మాటరాలేక స్థబ్దులయ్యారు.
ఇదే సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు ఘటనను గమనించారు. ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా వాహనం ఆపి గాయపడిన వెంకటేశ్వర్లను సాంత్వనపరచారు. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చి, 108 అంబులెన్స్‌కు కాల్ చేసి, గాయపడిన బాధితుడిని తనే స్వయంగా ఆసుపత్రికి చేర్చారు. రక్తంతో తడిసిన ఆయనకు ప్రథమ చికిత్స అందేలా క్షణక్షణం పర్యవేక్షిస్తూ, ధైర్యం చెప్పడం మానవీయతకు నిదర్శనమైంది. ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది. "ఒకరి నిర్లక్ష్యం వల్ల అమాయక కుటుంబాలు ఎన్ని ప్రాణాలు కోల్పోవాలి?" అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




# స్మార్ట్ కిడ్జ్ పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా సరస్వతి పూజ

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 1, తెలంగాణ ముచ్చట్లు:** ఖమ్మం పట్టణంలోని బ్యాంకు కాలనీ నందు 55వ డివిజన్ కార్పొరేటర్ మోతరపు శ్రావణి సుధాకర్ ఆధ్వర్యంలోని సిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఆదివారం 'స్మార్ట్ కిడ్జ్ పాఠశాల' ఆధ్వర్యంలో "సరస్వతి పూజ" కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించటం జరిగింది. ఈ పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్మార్ట్ కిడ్జ్ కరెస్పాండంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య పాల్గొన్నారు.
200 చిన్నారులకి సరస్వతి పూజ సామగ్రి, పుస్తకాలు, పెన్నులు,సరస్వతి దేవి ప్రతిమ అందించారు..
చిన్నారులందరికీ సరస్వతి దేవి అనుగ్రహం ఉండాలని ప్రార్థించారు..ఈ కార్యక్రమంలో మోతరపు సుధాకర్,భాస్కర్ రావు,వేగినాటి మధు,నవీన్,ప్రసాద్,నరేష్ తదితర ఉత్సవ కమిటీ సభ్యులు,భక్తులు పెద్ద ఎత్తున పూజలో పాల్గొన్నారు.




# సిపిఎస్ రద్దు – ఓపిఎస్ అమలు చేయాలని ఉద్యోగుల డిమాండ్

## జిల్లా కలెక్టరేట్ ఎదుట టీజీఈజెఏసి నిరసన

**వనపర్తి,సెప్టెంబర్ 1(తెలంగాణ ముచ్చట్లు):** సిపిఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (ఓపిఎస్) అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, టీజీఈజెఏసి వనపర్తి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన చేపట్టారు.
నేతలు మాట్లాడుతూ... సిపిఎస్ విధానం వల్ల వేలాది మంది ఉద్యోగులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఉద్యోగుల భవిష్యత్తును కాపాడే మార్గం ఓపిఎస్ అమలేనని స్పష్టం చేశారు. తమ డిమాండ్లు తక్షణమే నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.
ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు అశోక్ కుమార్, వరప్రసాదరావు, నాయకులు రవి ప్రసాద్ గౌడ్, మద్దిలేటి, అనిల్ కుమార్, శ్రీనివాసరావు, భాను ప్రసాద్, చంద్రశేఖర్, నాగేందర్, నాగరాజు, సి.ఎస్.రాజు, మహేష్, భాస్కర్, ఏసేపు, అబ్బాస్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.




# గృహప్రవేశ మహోత్సవానికి బెండలపాడు రెడీ...!

**ఈ నెల 3న సీఎం రేవంత్ రెడ్డి రాక ఖరారు**

**మంత్రి పొంగులేటి సూచనల మేరకు సభా ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ , తుంబూరు దయాకర్ రెడ్డి**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 1, తెలంగాణ ముచ్చట్లు:**
అశ్వారావుపేట నియోజకవర్గం చంద్రుగొండ మండలంలోని బెండలపాడు గ్రామంలో ఈ నెల 3వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు జరగనున్న ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ మహోత్సవానికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి రానున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచనల మేరకు సభాస్థలిని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న ఇండ్లను పరిశీలించిన అనంతరం సభకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లను సమీక్షించారు. ముఖ్యంగా వర్షం పడిన సందర్భంలో ప్రజలు, విచ్చేసే అతిథులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు.




# ఉప్పల్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

## పలు మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు

**ఉప్పల్, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు)**
గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉప్పల్ డివిజన్, హబ్సిగూడ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాలను ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో కలిసి గణనాథుని ఆశీర్వాదాలు పొందారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, "విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ఉప్పల్ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో అభివృద్ధి సాధించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.ప్రత్యేక పూజల అనంతరం రజిత పరమేశ్వర్ రెడ్డి స్థానిక కమిటీ సభ్యులతో భక్తి భావంతో మాటలాడి, ఉత్సవాల నిర్వహణలో వారి కృషిని ప్రశంసించారు. పలు మండపాల్లో ఏర్పాట్లను పరిశీలించి అన్నదాన కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు.
ఉత్సవాల్లో భాగంగా ఆయన సందర్శించిన మండపాలు:
ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు సోమ్ బాలమణి నివాసంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం పద్మావతి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ భారత్‌నగర్ వినాయక మండపం,న్యూ శాంతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ మండపం ఆకారపు అరుణ్ వెంకట్ రెడ్డి నగర్ మండపం (హబ్సిగూడ డివిజన్)ఈ పర్యటనలో రజిత పరమేశ్వర్ రెడ్డితో పాటు స్థానిక వినాయక మండప సభ్యులు, భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.



# రాంపల్లిలో శివ గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక నిమజ్జనం

**గ్రామ ప్రజల ఘనస్వాగతం, సాంప్రదాయ వాద్యాలతో ఊరేగింపు**

**నాగారం, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి గ్రామంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక వైభవంతో కొనసాగాయి. రాంపల్లి శివాలయంలో శివ గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని మండపంలో ఐదు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు, హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం సాయంత్రం గ్రామంలో గణనాథుని శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. ఈ శోభాయాత్రలో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని గణనాథునికి భక్తి గీతాలు పాడుతూ ఊరేగింపులో పాల్గొన్నారు. శివ గణేష్ యూత్ సభ్యులు డప్పులు, డీజే మ్యూజిక్, సాంప్రదాయ వాద్యాలతో ఊరేగింపును మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.తరువాత గణనాథుని ప్రతిమను ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎలసాని బాల్‌రాజ్ యాదవ్, గ్రామ పెద్దలు, శివ గణేష్ యూత్ సభ్యులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని వినాయకుని ఆశీస్సులు కోరుకున్నారు.
గ్రామంలో నవరాత్రి ఉత్సవాల సమయంలో ప్రత్యేక అలంకరణలు, దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి. భక్తులు రోజువారీ పూజల్లో పాల్గొని గణనాథుని ఆశీర్వాదం పొందారు.




# 68,116 రూపాయలకు లడ్డు కైవసం చేసుకున్న అరిగే రజినీకాంత్

## రాంపల్లిలో సాయి దుర్గ రెసిడెన్సి వినాయక నిమజ్జనం వైభవంగా

**నాగారం, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ నియోజకవర్గం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి గ్రామంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. సాయి దుర్గ రెసిడెన్సి కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు గణనాథుని ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, భజనాలు నిర్వహించారు. ప్రతి రోజు కాలనీ వాసులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో వినాయకునికి సేవలు అందించారు.ఆదివారం లడ్డు ప్రసాదం వేలంపాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మొత్తం 21 కిలోల బరువున్న లడ్డును అధిక ధరకు కైవసం చేసుకోవడంలో ఉత్సాహంగా పోటీ జరిగింది. చివరికి అరిగే రజినీకాంత్ 68,116 రూపాయలకు లడ్డు కైవసం చేసుకున్నారు. ఈ వేలంపాట ద్వారా వచ్చిన మొత్తం ఆదాయాన్ని ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.
తరువాత శోభాయాత్ర రూపంలో వినాయకుని ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. కాలనీ వీధులు పూలతో, రంగోలీలతో అలంకరించగా, బజాజ్ బృందాలు, భక్తి గీతాలు, నృత్యాలతో ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళలు సంప్రదాయ వేషధారణలో పాల్గొనగా, చిన్నారులు వినాయక వేషధారణలో శోభాయాత్రను మరింత ఆహ్లాదకరంగా మార్చారు.ఈ కార్యక్రమంలో సాయి దుర్గ రెసిడెన్సి కాలనీ అసోసియేషన్ సభ్యులు రామారం టింకు గౌడ్, సత్య ప్రసాద్, మంగరై మహేందర్, దుర్గాప్రసాద్, సత్యానంద్, అరిగే శ్రీకాంత్ తదితరులు పాల్గొని ఉత్సవ విజయవంతం చేశారు. కాలనీ వాసులు స్వయంగా నిర్వహణలో భాగస్వాములు కావడం గమనార్హం.



# మల్కాజ్గిరిలో బ్రాహ్మణ కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయింపు

- **ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కృషికి బ్రాహ్మణ సంఘం కృతజ్ఞతలు**
- **సమాజ సంక్షేమం కోసం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కృషి ఫలించింది**

**మల్కాజ్గిరి, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి శాసనసభ నియోజకవర్గానికి చెందిన బ్రాహ్మణ సమాజానికి శుభవార్త అందింది. నియోజకవర్గంలో ప్రత్యేక బ్రాహ్మణ కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం స్థలం కేటాయింపు ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఆదివారం అసెంబ్లీలో మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్ శాఖల మంత్రి మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి శ్రీధర్ బాబును మర్యాద పూర్వకంగా కలసి విజ్ఞప్తి చేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, మల్కాజ్గిరి నియోజకవర్గంలో బ్రాహ్మణ కుటుంబాలు గణనీయంగా నివసిస్తున్నాయని,వివాహాలు, కర్మకాండలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సమగ్ర కమ్యూనిటీ భవనం అవసరం ఉందని వివరించారు. పేద బ్రాహ్మణ కుటుంబాలకు ఇది మేలు కలిగిస్తుందని తెలిపారు.మంత్రి శ్రీధర్ బాబు ఈ విజ్ఞప్తిని సానుకూలంగా స్వీకరించి జిల్లా కలెక్టర్‌కు తక్షణమే స్థల కేటాయింపుపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.తరువాత తెలంగాణ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చి మర్రి రాజశేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమాజం అభ్యున్నతి పట్ల ఆయన చూపుతున్న శ్రద్ధను కొనియాడారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు, కార్యదర్శి మరియు పలువురు ప్రముఖ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బండారు శ్రీనివాసులుకు ఘన సన్మానం

**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**వనపర్తి, సెప్టెంబర్01(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి పట్టణం 30వ వార్డుకు చెందిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బండారు శ్రీనివాసులు పదవీ విరమణ పొందిన సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఆయన గృహంలోనే శ్రీనివాసులు దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ, పదవీ విరమణ అనంతరం దంపతులు కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్, రైతు సమితి అధ్యక్షులు నరసింహ, నాయకులు రవి ప్రకాష్ రెడ్డి, శేఖర్, చిట్యాల రాము, స్వామి సురేందర్ రెడ్డి, పాపన్న, నరసింహ, శ్రీనివాస్ రెడ్డి, ఎల్ల గౌడ్, మురళి గౌడ్, గోపాల్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, బాల్ రెడ్డి, కుమ్మరి సత్తి తదితరులు పాల్గొన్నారు.



## ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకొని అంబేద్కర్ బాటలో పయణించాలి

- **దళితుల ఆభ్యున్నతికి రౌతు రమేష్ కృషి.**
- **రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య.**

**హసన్‌పర్తి,సెప్టెంబర్01 (తెలంగాణ ముచ్చట్లు):** రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అందించిన ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకొవాలని, దళితుల ఆభ్యునతికి రౌతు రమేష్ కృషి మరువలేనిదని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు.సోమవారం రోజు ఎర్రగట్టు గుట్ట సమీపంలోని బాలాజి గార్డెన్ లో డిబిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ విద్యుత్ ఉద్యోగ పదవి విరమణ సన్మాన సభకు ముఖ్యఅథిదిగా హజరైన రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ రౌతు రమేష్ ప్రమీల దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగాచైర్మన్ మాట్లాడుతూ తరతరాలుగా బానిసత్వం లో మునిగిపొయిన ఎస్సీఎస్టీ ల విముక్తికి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.అర్. అంబేద్కర్ జీవితాంతం పొరాటం చేశారన్నారు.ప్రశ్నించే తత్వం లేకపొతే సమాజ మనుగడలేదని చదువే సమాజ మార్పుకు దోహదం చేస్తుందన్నారు.డిబిఎఫ్ వ్యవస్థాపకులు కొరివి వినయ్ కుమార్ మాట్లాడుతూ వామపక్ష భావజాలం తో విద్యార్ధి ఉద్యమ నాయకుడిగా రౌతు రమేష్ జీవితం మొదలు పెట్టి జర్నలిస్టుగా,ఉద్యోగిగా పని చెస్తునే దళిత ఉద్యమం లో క్రియాశీలకంగా పనిచెస్తున్నాడని అన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు నీలాదేవి,రేణికుంట్ల ప్రవీణ్, జిల్లా శంకర్,రాముబాబు నాయక్,డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్,వివిధ సంఘాల నాయకులు పాల్గోని రౌతు రమేష్‌ను ఘనంగా సన్మానించారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నమీండ్ల శ్రీనివాస్,
డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్,కేయూ జెఎసి చైర్మన్ డాక్టర్ మంద వీరస్వామి,జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు అంకేశ్వరపు రాంచందర్ రావ్,అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకుడు సింగారపు రవిప్రసాద్,డిబిఎఫ్ రాష్ట్ర మహిళా నాయకురాలు బొర్ర సంపూర్ణ, జిల్లా అధ్యక్షుడు కొమ్ముల కరుణాకర్,జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల అనిత,జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, పసుల దాసు,దోమ కొమురయ్య, చిలువేరు స్వామి,మొగిళి,బండి ఆశోక్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిని కలిసిన ఎంపీ కడియం కావ్య

**హైదరాబాద్,సెప్టెంబర్01 (తెలంగాణ ముచ్చట్లు):**

సెప్టెంబర్ 9న జరగనున్న ఉప రాష్ట్రపతి ఎన్నికల కోసం ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి హైదరాబాద్‌లో మద్దతు సాధించే క్రమంలో పర్యటించారు. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్యను ఆయన కలిశారు.
భేటీ సందర్భంగా కూటమి వ్యూహాలు, ఎన్నికల ప్రణాళికలు, అభ్యర్థి విజయావకాశాలపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. కడియం కావ్య మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ పట్ల నిబద్ధత కలిగిన సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వం దేశ ప్రజాస్వామ్య బలపాటుకు దోహదం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ఆయన అభ్యర్థిత్వం ఇండియా కూటమికి అదనపు శక్తినిస్తోందని, రాబోయే ఎన్నికల్లో కీలక ఫలితాలను సాధించడానికి తోడ్పడుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఇండియా కూటమి అభ్యర్థిని ఎంపీలు కలుసుకోవడం, ఆయన అభిప్రాయాలు తెలుసుకోవడం ఎన్నికల హోరును మరింత ఆసక్తికరంగా మార్చింది.







## పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ లో చేరికల జోరు

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 1, తెలంగాణ ముచ్చట్లు:**

- **రాయిగూడెం గ్రామానికి చెందిన మరో 40 బీఆర్ఎస్ కుటుంబాలు ఆ పార్టీకి రాజీనామా**
- **మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి సమక్షంలో కాంగ్రెస్ లో చేరిక**

పాలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలగం రోజురోజుకూ విస్తరిస్తోంది. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వరుసగా జరుగుతున్న చేరికలు కాంగ్రెస్‌కు కొత్త ఊపునిస్తున్నాయి.
మూడు రోజుల క్రితం నేలకొండపల్లి మండలంలోని రాయిగూడెం గ్రామానికి చెందిన 60 బీఆర్ఎస్ కుటుంబాలు కాంగ్రెస్ కండువా కప్పుకోగా, తాజాగా సోమవారం అదే గ్రామానికి చెందిన మరో 40 బీఆర్ఎస్ కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి.
ఈ చేరికలు స్థానిక నాయకుడు నంబూరి రామారావు ఆధ్వర్యంలో ఖమ్మంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి సమక్షంలో జరిగాయి.
ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.... పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల వల్ల ప్రజలు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, ప్రాధాన్యత లభిస్తుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నుపూసల సీతారాములు, నాయకులు కొడాలి గోవింద రావు, కొర్లకుంట నాగేశ్వరరావు, బోయిన బ్రహ్మం, బైరు లక్ష్మీనారాయణ, సూరేపల్లి ప్రేమ్ కుమార్, సూరేపల్లి ప్రభాకర్, బోయిన సారధి, తీగ రామయ్య, లక్క తిరుపయ్య, నంబూరి నరేందర్, కోసూరి సత్యనారాయణ, కోసూరి రాంబాబు తదితర నాయకులు పాల్గొన్నారు.





## సత్తుపల్లి పి.వి.ఎన్ కాలనీలో వినాయక నవరాత్రుల సందడి

**ఐఎన్టియుసి నేతల ఆధ్వర్యంలో ఘనంగా మహా అన్నదాన కార్యక్రమం.**

**సత్తుపల్లి, సెప్టెంబర్ 01 ( తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి పట్టణంలోని సింగరేణి పి.వి.ఎన్ కాలనీలో శ్రీ మహాగణపతి మండపంలో సోమవారం వినాయక నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు విస్తృతంగా పాల్గొని ఉత్సవానికి శోభను చేకూర్చారు.
ఉదయం జరిగిన పూజా కార్యక్రమాల్లో సింగరేణి అధికారులు ప్రాజెక్ట్ ఆఫీసర్లు ప్రహల్లాద్, నరసింహారావు, ప్రాజెక్ట్ ఇంజనీర్ శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ రజాక్‌తో పాటు ఐఎన్టియుసి నేతలు పాల్గొన్నారు. అనంతరం వారు మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు స్వామివారి అన్నప్రసాదాన్ని అందజేశారు.
ఈ సందర్భంగా వైస్ ప్రెసిడెంట్ రజాక్ మాట్లాడుతూ పి.వి.ఎన్ కాలనీ ఉద్యోగులు ప్రతి సంవత్సరం వినాయక విగ్రహ ప్రతిష్టాపన చేసి భక్తి శ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈసారి విగ్రహ దాతలుగా మోహన్, సంధ్యారాణి దంపతులు ముందుకు రావడం విశేషమని పేర్కొన్నారు. కాలనీ రక్షణ, లోకకల్యాణం కోసం ఇలాంటి వేడుకలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఆయన అభిప్రాయపడ్డారు.
ఉత్సవాలలో కాలనీ కుటుంబ సభ్యులు, సింగరేణి అధికారులు, యూనియన్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అకాల వర్షా లతో దెబ్బతిన్న పంట పొలాలను రైతులను ఆదుకోవాలి



**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 1, తెలంగాణ ముచ్చట్లు;** చింతకాని మండలం నేరడ గ్రామంలో పంట పొలాలు వరద పడి నష్టపోయిన రైతులును కలిసి సోమవారం పంట పొలాలను పరిశీలించారు సిపిఐ పార్టీ బృందం వారు మాట్లాడుతూ పంట చేతికొచ్చే పంటలు వర్షాలతోటి దెబ్బతిని పోయారని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని రైతులను ఆదుకోవాలని పెసర పంట మునిగిన రైతుకు ఎకరానికి ఇరవై వేలు మొక్కజొన్న వరి రైతులకు ఎకరానికి ముప్పై వేలు పత్తి రైతులుకు ఎకరానికి 50 వేలు నష్టపరిహారం ఇవ్వాలి ఆయన అన్నారు గ్రామాలలో వర్షాల వలన అంటువ్యాధులు ప్రభలకుండా బ్లీచింగ్ చల్లించాలి ప్రభుత్వం వెంటనే అధికారుల బృందలను గ్రామాలకు పంపాలని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు మండల నాయకులు గోగుల ఆది మట్టా రవి గ్రామ నాయకులు కోటయ్య గురుమూర్తి గురవయ్య శంకరరావు నాగుల్ మీర్ మస్తాన్ రసూల్ సాయి తిరుపతిరావు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



**నాగారం, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు)**

- **మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ**
- **నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్ప శ్రీనివాసరెడ్డి**

మేడ్చల్ నియోజకవర్గం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. కాలనీ వాసుల పిలుపు మేరకు నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస రెడ్డి, మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యక్షంగా వచ్చి పనుల ప్రగతిని పరిశీలించారు.నాయకులు ఈ సందర్భంగా కాలనీలోని రహదారి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాలనీ వాసుల అభ్యర్థనల మేరకు మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమం లో కాలనీ అధ్యక్షుడు రాఘవేంద్ర రావు, జనరల్ సెక్రటరీ శ్రీకాంత్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, మద్దిరెడ్డి రాజిరెడ్డి, మామిడాల సతీష్తో పాటు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
మంగళవారం-02- సెప్టెంబర్ 2025


# ముదిరాజ్ హక్కుల కోసం పార్టీలకతీతంగా ఏకం కావాలి

ముదిరాజ్ వర్గానికి బీసీ-డీ నుండి బీసీ-ఏ రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్
ముదిరాజ్ సమాజాన్ని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఐక్యం చేయాలన్న సంకల్పం
ముదిరాజ్‌లు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో పూర్తిగా అనగదొక్క బడుతున్నారు
మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా రాగుల అశోక్ ముదిరాజ్ బాధ్యతలు స్వీకరణ






**కీసర, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజ్ వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత (కొలి సమాజ్) ముదిరాజ్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు రోటం భూపతి ముదిరాజ్ కీలక నిర్ణయాలు ప్రకటించారు. సికింద్రాబాద్‌లోని హోటల్ పద్మినిలో ఆదివారం నిర్వహించిన అఖిల భారత కొలి సమాజ్ తెలంగాణ రాష్ట్ర తొలి కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

"ఇక ముదిరాజ్‌లు మేల్కోవాల్సిన సమయం వచ్చింది" భూపతి ముదిరాజ్ మాట్లాడుతూ, "బీసీ వర్గాల్లో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ వర్గం రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అన్యాయానికి గురవుతోంది. ఇప్పటివరకు ముదిరాజ్‌లను ఓటు బ్యాంకులా మాత్రమే చూసారు. ఇకపై ఈ పరిస్థితిని సహించం. బీసీడీ నుండి బీసీఏ వర్గంలోకి చేర్పించాలన్న డిమాండ్‌ను సీఎం ముందు ఉంచుతాం. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతాం. ముదిరాజ్ కార్పొరేషన్‌కు కనీసం రూ!1000 కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని అడుగుతాం" అని స్పష్టం చేశారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ముదిరాజ్ సమాజాన్ని ఐక్యం చేసి ఉద్యమాలను ప్రారంభిస్తామని చెప్పారు.

"ముదిరాజ్‌లు తమ హక్కులను స్వయంగా సాధించుకునే దిశగా పటిష్ట కృషి చేయాలి" అని పిలుపునిచ్చారు.రాగుల అశోక్ ముదిరాజ్‌కు జిల్లా బాధ్యతలు సమావేశంలో పలు జిల్లాల అధ్యక్షులను ప్రకటించారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా ముదిరాజ్ (కొలి) సమాజ్ అధ్యక్షుడిగా కీసర మండలం వన్నిగూడ గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాగుల అశోక్ ముదిరాజ్ నియమితులయ్యారు. నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు.జిల్లా అధ్యక్షుడి గా బాధ్యతలు స్వీకరించిన అశోక్ ముదిరాజ్ మాట్లాడుతూ, "నా మీద నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన జాతీయ, రాష్ట్ర నాయకులకు ధన్యవాదాలు. ముదిరాజ్‌లకు బీసీడీ నుండి బీసీఏ రిజర్వేషన్లు లభించే వరకు, రాజ్యాంగం హామీ ఇచ్చిన హక్కులు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తాను. మేడ్చల్ జిల్లాలోని ప్రతి గ్రామానికి తిరిగి ముదిరాజ్ బంధువులను ఐక్యం చేసే కార్యక్రమాలు చేపడతాను" అని అన్నారు.

సమావేశంలో పాల్గొన్నవారు

ఈ సమావేశంలో అఖిల భారత ముదిరాజ్ (కొలి) సమాజ్ జాతీయ స్థాయి మరియు రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొన్నారు. సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ హామీల అమలు, సమాజ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ జరిగింది.



# మాల ఉద్యోగులు మోసపోకండి ఎస్సి వర్గీకరణ రద్దు కోసం ఉద్యమిద్దాం

రోస్టర్ రద్దు కోరకని అనడం కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఉద్యోగుల కుట్ర
డాక్టర్ పసుల రాంమూర్తి జాతీయ అధ్యక్షుడు

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 1, తెలంగాణ ముచ్చట్లు;**

మాల మహానాడు ఆఫ్ ఇండియా ముఖ్య నాయకుల సమావేశం ఖమ్మం లోని ఓ ప్రైవేటు స్థలంలో జరిగినది, ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ పసుల రాంమూర్తి హాజరై ముందుగా మాల మహానాడు ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా చింతమల్ల సుందర్ రావు, ప్రధాన కార్యదర్శిగా గుమ్మడి కనకరాజు ను నియమించి ప్రసంగించారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జనాభా లెక్కల ప్రకారం కాకుండా మాదిగలకు అనుకూల వర్గీకరణ చేస్తే మాల ఉద్యోగులు వర్గీకరణ రద్దు అనకుండా రోస్టర్ ను మాత్రమే సరిచేయాలనడం ఉద్యమాన్ని తప్పుతోవ పట్టించడం అవుతుంది అన్నారు, రాజ్యాంగానికి వ్యతిరేకంగా వర్గీకరణ తీర్పు సుప్రీంకోర్టు ఇస్తే నోరుమేదపని వాళ్ళు జాతికి ఏం న్యాయం చేస్తారో అని అన్నారు, సీఎం రేవంత్ రెడ్డి గల్లా పట్టి వర్గీకరణ చట్ట విరుద్ధంగా ఎందుకు చేశావని అడగాలని ఉద్యోగులను కోరారు, రోస్టర్ కూడా రద్దు చేస్తే వర్గీకరణ సంగతి ఏమిటన్నాడు స్థానిక సంస్థల ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ నేతలు నాటకం ఆడిస్తున్నట్టు ఆడుతున్నారని మండి పడ్డారు, కొంత ఉద్యోగులు పదవి విరమణ చేసి ఉద్యమాన్ని తప్పు దోవ పట్టిస్తున్నారని డాక్టర్ పసుల రాంమూర్తి అన్నారు, ఈ కార్యక్రమంలో రాంబాబు, దార సంజీవ రావు, రామ్ లాల్, బాబు, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన కూడలిలో ప్రయాణం ప్రమాదకరం

వర్షా ప్రభావంతో ట్రాన్స్ఫార్మర్ తాకితే పెను ప్రమాదమే తెలిసిన తప్పనిసరి ప్రయాణం
ప్రయాణికుల ఇబ్బంది గమనించి బస్ సెల్టర్ ల నిర్మాణం చేయాలని డిమాండ్
టీడీపీ నేత వాసిరెడ్డి భాస్కరరావు...





**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 1, తెలంగాణ ముచ్చట్లు:**

తెలుగుదేశంపార్టీ టిఎన్ టియుసి రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి భాస్కరరావు నగరానికి వచ్చి పోయే ప్రయాణికులను ఇబ్బందులను ఉద్దేశించే మాట్లాడుతూ..

నగర ప్రధాన కూడలి ఇల్లందు క్రాస్ రోడ్డు, ఐటీ హబ్ (బస్ స్టాప్) ఇక్కడికి రోజుకు వేలల్లో ప్రయాణికులు వస్తూ పోతుంటారు, ఖమ్మం నుండి వైరా, కొత్తగూడెం, భద్రాచలం, సత్తుపల్లి పట్టణాలకు వెళ్లు ప్రయాణికుల నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం ఇది, కొత్త బస్టాండ్ మరియు పాత బస్టాండ్ నుండి వచ్చే బస్సులకు ప్రధాన కూడలి కాబట్టి బస్టాండ్ ల వద్ద కన్నా ఇక్కడే వేచి చూస్తుంటారు.

డ్రైనేజీ పనుల కారణంగా బస్ స్టాప్ షెడ్ లను క్రాస్ రోడ్డు నుంచి కోర్టు వరకు తొలగించారు కానీ డ్రైనేజీ కాలువల నిర్మాణ జాప్యంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నరని అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని అన్నారు,

డ్రైనేజీ కాలువల పనుల కోసం దాదాపు మూడు నెలలు కావస్తున్న పూర్తికాపవడం ఏంటని దుయ్యబట్టారు, బస్ స్టాప్ సేడ్ ల నిర్మాణం చేపట్టక పోవడంతో ఎండకి వానకి నిలువ నీడ లేకుండా నానా పాట్లు పడుతున్నారని అన్నారు, వర్షం వస్తే దగ్గరలో తల దాచుకోవడానికి ఎటువంటి షాపులు కూడా లేవని అధికారులు ఆలోచింపజేయాలని అన్నారు, అంతే కాక ట్రాన్స్ఫార్మర్ ఉండటంతో దాని ప్రక్కనే నిలబడి ఎదురు చూస్తూ జల్లు పడితే భయం భయంగా నిలిచొవలిసి వస్తుందని అన్నారు. ఇన్ని రకాలుగా ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ పనులు నత్త నడకన సాగుతుండడం బాధాకరమని తక్షణమే మంత్రులు చొరవ తీసుకోవాలని కోరారు, ఇప్పటికైన సంబంధిత అధికారులు త్వరీతగా పనులను చక్కబెట్టి బస్సు సెల్టార్ లను నిర్మించి ప్రజల ఇక్కట్లను తీర్చాలని తెలుగుదేశంపార్టీ తరపున డిమాండ్ చేశారు.



# ఎన్టీఆర్ కాలనీలో సీపీఎం సర్వే.!

ప్రజా ధనంతో నిర్మించిన కమ్యూనిటీ హాలు చెత్త గూడెంగా
20 ఏళ్లుగా అద్దె ఇళ్లలోనే ప్రజల వేదన


**సత్తుపల్లి, సెప్టెంబర్ 01 (తెలంగాణ ముచ్చట్లు):**

ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణ పరిధిలోని 9వ వార్డులో గల ఎన్టీఆర్ కాలనీలో సోమవారం సాయంత్రం సీపీఎం నేతలు ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించి ప్రజలతో మాట్లాడారు.

లక్షల రూపాయలు ప్రజా ధనం వెచ్చించి నిర్మించిన కమ్యూనిటీ హాలు వాడుకలో లేకపోవడంతో చెత్త, పిచ్చి మొక్కలతో నిండిపోయి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని నేతలు మోరంపూడి పాండురంగారావు, రావుల రాజబాబు, కొలికపోగు సర్వేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

గత 20 ఏళ్లుగా అద్దె ఇళ్లలో నివసిస్తూ కూలి చేసుకుంటూ జీవిస్తున్న కుటుంబాలకు ఇప్పటివరకు సర్కారు ఇళ్లు మంజూరు కాలేదని ప్రజలు నేతల దృష్టికి తీసుకువచ్చారు. అదనంగా, సైడ్ డ్రైన్‌లు బూడిపోయి శుభ్రం చేయకపోవడంతో పారిశుధ్య సమస్యలు తీవ్రరూపం దాల్చాయని స్థానికులు తెలిపారు. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు పిచ్చి మొక్కలతో అడవిలా మారి పాముల నిలయంగా మారిపోయాయని, వాటిని శుభ్రం చేయించేలా మున్సిపల్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ సర్వేలో అఖిల భారత మహిళా సంఘం (ఐద్వా) నాయకురాళ్లు పాకలపాటి ఝాన్సీ, చెరుకు కుమారి, మల్లూరు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అభిమాన నేత పిలుపుతో మృత్యువును జయించిన వీరాభిమాని





**వనపర్తి,సెప్టెంబర్1(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా కేంద్రంలో ఆదివారం అరుదైన సంఘటన చోటుచేసుకుంది. చనిపోయాడని భావించిన వ్యక్తి ఒక్కసారిగా లేచి కూర్చోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు. వనపర్తికి చెందిన తైలం రమేష్ తెలంగాణ ఉద్యమ కారుడు. ఉద్యమ సమయంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డితో కలిసి పనిచేసి, ఆయనకు వీరాభిమానిగా మారాడు. నిరంజన్ రెడ్డి పట్ల ఉన్న మక్కువతో తన రెండు ఎదలపై ఆయన పేరు, ఫోటోలను పచ్చబొట్టుగా వేయించుకున్నాడు. హైదరాబాద్‌లో నివసిస్తున్న రమేష్, ఆదివారం వనపర్తికి వచ్చి అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యాడు. కదలికలు లేకపోవడంతో మరణించాడని భావించి కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాల ఏర్పాట్లు ప్రారంభించారు. పూలమాలలు వేసి, దహన సంస్కారాల ఖర్చులు కూడా సిద్ధం చేశారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, రమేష్‌కి కడ చూపు కోసం ఇంటికి వెళ్లారు. పూలమాల వేసే క్రమంలో ఆయన శరీరంలో కదలికలు గమనించారు. వెంటనే "రమేష్... రమేష్..." అని పిలవగానే మరింత కదలిక కనిపించడంతో ఆందోళన చెందకుండా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల చికిత్సతో రమేష్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. నిరంజన్ రెడ్డి సమయస్ఫూర్తి వల్లే రమేష్ మళ్లీ బ్రతికాడని కుటుంబ సభ్యులు భావోద్వేగానికి లోనై కృతజ్ఞతలు తెలిపారు.



# చిల్కానగర్ లో వినాయక మండపాలు సందర్శించిన కార్పొరేటర్ గీత ప్రవీణ్

**చిల్కానగర్, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గం చిల్కానగర్ డివిజన్ పరిధిలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ పలు కాలనీలు, బస్తీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రతీ మండపంలో భక్తులను పలకరించి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. స్థానికుల అభ్యర్థన మేరకు కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలు ఆరోగ్యంగా, సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.

స్థానికులు కార్పొరేటర్‌ను ఘనంగా ఆహ్వానించి సన్మానించారు. ఈ సందర్భనలో బీఆర్ఎస్ నాయకులు, స్థానిక కాలనీ ప్రతినిధులు, మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

# పెసర,పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

బీ ఆర్ స్ జిల్లా నాయకులు మంకెన రమేష్ డిమాండ్



**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 1, తెలంగాణ ముచ్చట్లు:**

చింతకాని మండల పరిధిలో గత పది రోజుల నుండి ఎడ తెరపీ లేకుండా కురుస్తున్న భారీవర్షాలకి మండల వ్యాప్తంగా ప్రధానంగా పెసర,పత్తి పంటలు నీట మునిగి పెద్ద మొత్తంలో రైతులు నష్ట పోయారు అని వ్యవసాయ అధికారులు పంట నష్టం అంచనా వేసి రైతులని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పెసర పంట కోత దశకు వచ్చిన నాటి నుండి అతి భారీ వర్షాల వలన పంట పైనే మొక్కలు వచ్చి పెద్ద మొత్తంలో పంట నష్టం జరిగింది అని,పత్తి పంట భారీ పెట్టుబడి పెట్టి సాగు చేస్తే భారీ వర్షాలకి పత్తి పంట నీట మునిగి,ఊటలు తీస్తూ పత్తి పంటకు నష్టం జరిగినట్లు మంకెన రమేష్ తెలిపారు.పెసర పంటని మార్క్ ఫైడ్ ద్వారా కొనుగోలు చెయ్యాలని,నష్ట పోయిన రైతులను ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని పెసరకి 30,000/రూ,పత్తి పంటకు 75,000/రూ.ఎకరాకు నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

# రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే యూరియా కొరత

ఘనపూర్ బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రాళ్ల కృష్ణయ్య



**ఘనపూర్,సెప్టెంబర్01 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే యూరియా కొరతకు కారణమని, దీనికి కేంద్రం బాధ్యురాలు కాదని బీఆర్ఎస్ పార్టీ ఘనపూర్ మండల అధ్యక్షులు రాళ్ల కృష్ణయ్య విమర్శించారు.

మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, మూడు నెలలుగా యూరియా కొరత ఉందని ప్రచారం చేస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. జిల్లాకు సరిపడా యూరియా తరలించి, మిగతా జిల్లాల రైతులను ఇబ్బందుల్లోకి నెట్టివేస్తున్నారని మండిపడ్డారు.

ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళిక లేకపోవడంతో ప్రైవేట్ డీలర్లు పెద్ద మొత్తంలో యూరియా నిల్వలు చేసి బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనలో అనుభవం లేకపోవడంతోనే రాష్ట్ర రైతులు నష్టపోతున్నారని వ్యాఖ్యానించారు.

సకాలంలో ఎరువు అందక మన స్తాపం చెందిన ఘనపూర్ కేంద్రానికి చెందిన రైతు బిక్కి కేశవులు పిఎసిఎస్ కార్యాలయం భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమని తెలిపారు. రైతులు యూరియా కోసం భార్యా బిడ్డలను వదిలి ప్రాణాలకే తెగిస్తున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళు మూసుకుందని ఆయన విమర్శించారు.

"ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని గణనాధుడిని వేడుకుంటున్నాను. తెలంగాణ అంతట యూరియా ఉందని మేకపోతు గాంబీర్యం ప్రదర్శించడం ఆపాలి" అని రాళ్ల కృష్ణయ్య అన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ‘కవిత వ్యాఖ్యలతో అవినీతి జరిగిందనేది స్పష్టమైంది’

(మొదటి పేజీ తరువాయి)




సీఎం రేవంత్‌పై కవిత చేసిన వ్యాఖ్యలను సరికాదన్నారు. కుటుంబ గొడవల్ని తీసుకొచ్చి సీఎం రేవంత్‌పై రుద్దడం ఏంటని ప్రశ్నించారు.

ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు మహేష్ గౌడ్. ‘సీఎం రేవంత్‌పై కవిత చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నా. కవిత వ్యాఖ్యలతో కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని తేలిపోయింది. కాళేశ్వరంలో తప్పు చేసింది కేసీఆర్ లేదా హరీష్ రావా అనేది మాకు అనవసరం. వారి హయాంలో స్కామ్ జరిగిందనేది కవిత వ్యాఖ్యలతో తేటతెల్లమైంది. కాళేశ్వరంలో మామ కేసీఆర్ వాటా ఎంత..?, అల్లుడు హరీష్ రావు వాటా ఎంత? అనేది తేలాల్సి ఉంది. మీ కుటుంబ కలహాలను మాపై రుద్దడం ఏంటి?’ అని ప్రశ్నించారు. కేసిఆర్ కుటుంబ కలహాలతో కాంగ్రెస్‌కు సంబంధంలేదన్నారు మహేష్ గౌడ్.

# వెంటనే సీబీఐ విచారణకు లేఖ పంపండి

(మొదటి పేజీ తరువాయి)



కోరుతున్నామని గుర్తుచేశారు. అయితే, అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌ను కాపాడే ఉద్దేశంతోనే ఇన్నాళ్లూ చర్యలు తీసుకోవడంలో జాప్యం చేసిందని ఆరోపించారు. ‘‘ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నిజానికి తలవంచి, ఈ కేసును సీబీఐకి అప్పగించేందుకు అంగీకరించింది. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సీబీఐకి లేఖ పంపాలి’’ అని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును విమర్శిస్తూ, గతంలో ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) టోల్ టెండర్ల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం సిట్‌ను ప్రకటించిందని, కానీ నేటికీ అది కార్యరూపం దాల్చలేదని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కూడా ఒక డైలీ సీరియల్‌లా కొనసాగుతోందని ఆయన విమర్శించారు. కాళేశ్వరం విషయంలో ఇంత జరిగాక, బీఆర్ఎస్ నైతిక బాధ్యత వహించాలని ఆయన స్పష్టం చేశారు.

# ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేస్తాం



పరస్పర విశ్వాసం, గౌరవం ఆధారంగా చైనాతో సంబంధాలను పెంచుకునేందుకు భారత్ కృతనిశ్చయంతో ఉన్నదని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) నేతల సదస్సుకు ముందు ఆయన ఆదివారం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. కజన్‌లో గత సంవత్సరం జరిగిన సమావేశంలో ఫలప్రదమైన చర్చలు జరిపామని, ద్వైపాక్షిక సంబంధాలకు అవి సానుకూల దిశను అందించాయని జిన్‌పింగ్‌కు తెలిపారు. మోడీ అభిప్రాయంతో జిన్‌పింగ్ ఏకీభవించారు. ‘గత సంవత్సరం కజన్‌లో విజయవంతంగా జరిగిన సమావేశం కారణంగా భారత్‌చైనా సంబంధాలు పున్ణ ప్రారంభమయ్యాయి. రెండు దేశాల మధ్య అభిప్రాయాల మార్పిడి, సహకారం కొనసాగుతున్నాయి’ అని ఆయన చెప్పారు. గత సంవత్సరం అక్టోబర్ 23న కజన్‌లో జరిగిన బ్రిక్స్ నేతల సదస్సు సందర్భంగా ఇరువురు నాయకులు భేటీ అయిన విషయం తెలిసిందే. భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఈ మధ్య గత సంవత్సరం డిసెంబరులో జరిగిన సమావేశాన్ని మోడీ ప్రస్తావించారు. సరిహద్దు నిర్వహణపై రెండు దేశాల ప్రత్యేక ప్రతినిధులు ఒక ఒప్పందానికి వచ్చారని చెప్పారు. సరిహద్దులో నిస్సైనికీకరణ జరిగిన తర్వాత ఇప్పుడు శాంతి, సుస్థిరత నెలకొన్నదని తెలిపారు. ద్వైపాక్షిక సంబంధాలను స్థిరంగా ఉంచేందుకు తీసుకున్న రెండు ముఖ్యమైన చర్యలను మోడీ వివరించారు. ‘కైలాస్ మానస సరోవర్ యాత్ర తిరిగి ప్రారంభమైంది. రెండు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులు కూడా నడుస్తున్నాయి’ అని అన్నారు. విమాన సర్వీసులను తిరిగి ప్రారంభించడంపై ఆయన ప్రకటన చేయడం ఇదే మొదటి సారి. ‘మన సహకారం రెండు దేశాలకూ చెందిన 2.8 బిలియన్ల ప్రజల ప్రయోజనాలతో ముడిపడి ఉంది. మానవాళి సంక్షేమానికి కూడా ఇది దోహదపడుతుంది. ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకుపోవడానికి మేము కట్టుబడి ఉన్నాం’ అని ప్రధాని చెప్పారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఈ కూడా చర్చల్లో భాగస్వాములయ్యారు. ఉగ్రవాదం ప్రపంచ దేశాలకు ముప్పుగా పరిణమించిందని, దానిపై కలసికట్టుగా పోరాడాలని మోడీ సూచించారు.

# ఆశా వర్కర్లను నిర్బంధించడం దుర్మార్గం

- ప్రతినెల రూ!18,000 ఫిక్స్‌డ్ వేతనం, గ్రాట్యుటీ, పెన్షన్ డిమాండ్

మేడ్చల్-మల్కాజ్గిరి, సెప్టెంబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు)



ప్రజలకు ఆరోగ్య సేవలందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్ల ను పోలీసులు నిర్బంధించడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని సీఐటీయూ మేడ్చల్‌మల్కాజ్గిరి జిల్లా కోశాధికారి కె. ఉన్నికృష్ణన్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం. రేవతి కళ్యాణి ఆగ్రహం వ్యక్తం చేశారు.చలో హైదరాబాద్‌కి వెళ్లనీయని పోలీస్ చర్యలు సెప్టెంబర్ 1న నిర్వహించిన “చలో హైదరాబాద్” కార్యక్రమంలో పాల్గొనకుండా ఆదివారం, సోమవారం ఆశా వర్కర్లను పోలీస్ స్టేషన్లకు పిలిపించి, హెచ్చరికలు జారీ చేసి, లేటర్లు రాయించుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధ చర్యలని వారు అన్నారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను అణగదొక్కలేరని స్పష్టం చేశారు.ప్రధాన డిమాండ్లు.ప్రతి ఆశా వర్కర్‌కు నెలకు రూ 18,000 ఫిక్స్‌డ్ వేతనం పనిభారం తగ్గింపు, పెండింగ్ బిల్లుల తక్షణ చెల్లింపు వేతనాల కోత విధానాల ఉపసంహరణ పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత హామీ 2021 జూలైడిసెంబర్ 6వ పీఆర్‌సీ ఏరియర్స్ చెల్లింపు ఏఎన్ఎం, జీఎస్ఎం ట్రైనింగ్ పూర్తి చేసిన ఆశాలకు ప్రమోషన్లు గ్రాట్యుటీ, పెన్షన్ హక్కులు అమలు ప్రభుత్వానికి హెచ్చరిక “ప్రజల కోసం కృషి చేస్తున్న ఆశా వర్కర్ల సమస్యల ను పరిష్కరించకపోవడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. వెంటనే చర్యలు తీసుకోవాలి. లేని పక్షంలో పోరాటం మరింత ఉధృతం చేస్తాం,” అని నేతలు హెచ్చరించారు.

# గల్వాన్ వీరుల త్యాగాలను ప్రభుత్వం విస్మరించింది



ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ఆదివారం టియాంజిన్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిగిన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడిరది. చైనా పట్ల మోదీ సర్కార్ అనుసరిస్తున్న మెతక వైఖరిని ఎండగడుతూ, దేశ భద్రత విషయంలో రాజీ పడుతున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేసింది. చైనా దూకుడుకు, బెదిరింపులకు తలొగ్గడమే భారత కొత్త భద్రతా విధానమా అని సూటిగా ప్రశ్నించింది.కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ ‘ఎక్స్’ వేదికగా ప్రభుత్వ విధానాలను తప్పుబట్టారు. 2020 జూన్‌లో గల్వాన్ లోయలో 20 మంది భారత సైనికులు ప్రాణత్యాగం చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఆ త్యాగాలను విస్మరించి చైనాతో రాజీకి ప్రయత్నించడం దారుణమని విమర్శించారు. ‘‘చైనా దురాక్రమణను గుర్తించడానికి బదులుగా, ప్రధాని మోదీ వారికి క్లీన్ చిట్ ఇచ్చారు’’ అని ఆయన ఆరోపించారు. సరిహద్దుల్లో యథాతథ స్థితిని పూర్తిగా పునరుద్ధరించాలని ఆర్మీ చీఫ్ కోరుతున్నప్పటికీ, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకుండా చైనాతో సయోధ్యకు మొగ్గుచూపడం వారి దురాక్రమణను చట్టబద్ధం చేయడమేనని అన్నారు.ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌తో చైనా కుమ్మక్కైన తీరును మన ఆర్మీ డిప్యూటీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ జూలై 4న స్పష్టంగా వివరించారని జైరాం రమేశ్ గుర్తుచేశారు. ‘‘ఈ అపవిత్ర పొత్తుపై స్పందించాల్సింది పోయి, మోదీ ప్రభుత్వం దానిని మౌనంగా అంగీకరించి ఇప్పుడు చైనాకు రాచమర్యాదలు చేస్తోంది’’ అని ఆయన ఆక్షేపించారు.దేశీయంగా చైనా ఉత్పత్తుల డంపింగ్ విపరీతంగా పెరిగిపోయిందని, దీనివల్ల దేశంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (%మీవీజు%) తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యార్లంగ్ త్సాంగ్పో (బ్రహ్మపుత్ర) నదిపై చైనా నిర్మిస్తున్న భారీ హైడల్ ప్రాజెక్టు వల్ల ఈశాన్య రాష్ట్రాలకు తీవ్ర ముప్పు ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఆ విషయంపై ఒక్క మాట కూడా మాట్లాడకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. కాగా, ఇరు దేశాల మధ్య ఆర్థిక పురోగతి కోసం స్థిరమైన, స్నేహపూర్వక సంబంధాలను నిర్మించుకోవాలని మోదీ, జిన్‌పింగ్ తమ భేటీలో నిర్ణయించుకున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.

# పండుగలు ఐక్యమత్యానికి వేదికగా నిలవాలి

- గౌని సుదర్శన్ రెడ్డి అల్వాల గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు

పెద్దమందడి,సెప్టెంబర్01(తెలంగాణ ముచ్చట్లు):



ఆల్వాల గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గౌని సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ - పండుగలు, ఉత్సవాలు ప్రజల మధ్య ఐక్యతకు, సోదరభావానికి వేదికలుగా నిలవాలని పేర్కొన్నారు.

వినాయక చవితి సందర్భంగా రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. భారత సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శమని, కులమతాలకు అతీతంగా పండుగలను కలిసిమెలిసి జరుపుకోవడం మన ప్రాంతంలోనే కాక యావత్ దేశంలోనూ ఐక్యతకు నిదర్శనమని అన్నారు.

గణేష్ ఉత్సవ కమిటీలు ఘనంగా ఉత్సవాలు నిర్వహించడమే కాకుండా, పేదలకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం ద్వారా సమాజంలో సోదరభావం పెంపొందిస్తున్నాయని అభినందించారు. ఈ ఆనవాయితిని భవిష్యత్తులోనూ కొనసాగించాలని, తద్వారా ప్రజల మధ్య మరింత ఐక్యత ఏర్పడుతుందని సూచించారు.

వినాయక చవితి సందర్భంగా గ్రామ ప్రజలందరికీ ఆయన మరోసారి శుభాకాంక్షలు తెలిపారు.



# మాజీ ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ పెన్షన్ వివాదం

కొద్ది రోజుల క్రితమే భారత ఉపరాష్ట్రపతి పదవికి ఆకస్మికంగా రాజీనామా చేసి దేశ వ్యాప్తంగా చర్చకు దారితీసిన జగదీప్ దనడ్.. ఇప్పుడు మరో కొత్త వివాదానికి తెర తీశారు. మాజీ రాజస్థాన్ ఎమ్మెల్యేగా తనకు నిలిచిపోయిన పెన్షన్‌ను తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ ఆయన రాజస్థాన్ అసెంబ్లీ స్పీకర్‌కు లేఖ రాశారు. ఈ లేఖ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి, పలు పెన్షన్లకు అర్హత కలిగి ఉండి కూడా.. మరో పింఛన్ కోసం కోరడం ఆశ్చర్యం కలిగిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జగదీప్ దన?డ్ 1993 నుంచి 1998 వరకు రాజస్థాన్‌లోని కిషన్‌గఢ్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పని చేశారు. ఆ తర్వాత ఆయనకు మాజీ ఎమ్మెల్యేగా పెన్షన్ లభించేది. అయితే 2019లో ఆయన పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత.. రాజస్థాన్ నిబంధనల ప్రకారం ఆయన పెన్షన్ నిలిచిపోయింది. ఒక మాజీ ఎమ్మెల్యే ఏదైనా రాజ్యాంగబద్ధమైన లేదా ప్రభుత్వ పదవిని పొందినప్పుడు పెన్షన్ నిలిపివేయబడుతుంది. ఆయన ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన తర్వాత కూడా ఈ నిలిపివేత కొనసాగింది. తాజాగా జులై 21వ తేదీన ఉపరాష్ట్రపతి పదవికి దనడ్ రాజీనామా చేశారు. ఈక్రమంలోనే మాజీ ఎమ్మెల్యేగా తనకు లభించాల్సిన పెన్షన్‌ను తిరిగి ప్రారంభించాలని కోరుతూ దన డ్ రాజస్థాన్ అసెంబ్లీకి దరఖాస్తు చేసుకున్నారు. ఆయన వయస్సు 74 సంవత్సరాలు కావడం వల్ల.. రాజస్థాన్ మాజీ ఎమ్మెల్యేల పెన్షన్ నిబంధనల ప్రకారం ఆయనకు నెలకు రూ.42,000 పెన్షన్ లభిస్తుంది. ప్రస్తుతం దన?డ్ మాజీ ఉపరాష్ట్రపతిగా నెలకు దాదాపు రూ.2 లక్షలు, మాజీ ఎంపీగా నెలకు రూ.45,000 పెన్షన్ పొందనున్నారు. వీటన్నిటితో పాటు ఇప్పుడు మాజీ ఎమ్మెల్యే పెన్షన్ కూడా కలిస్తే ఆయనకు నెలకు దాదాపు రూ.2.87 లక్షల వరకు లభిస్తుంది.

# బిహార్ సీఎం అభ్యర్థిని నేనే

బీహార్‌లో మహా ఘట్‌బంధన్ కూటమి సీఎం అభ్యర్థి తానే అని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రకటించారు. ఆరా జిల్లాలో ‘ఓట్ అధికార్ యాత్ర’ కార్యక్రమంలోనే భాగంగా ఈ కామెంట్లు చేశారు. అయితే అప్పుడు రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్ కూడా అక్కడే ఉన్నారు. సీఎం అభ్యర్థిని తానేనంటూ తేజస్వీ యాదవ్ వారి సమక్షంలో ప్రకటించగా.. వారు మాత్రం చప్పుడు చేయలేదు. ముఖ్యంగా రాహుల్ గాంధీ మాత్రం దీనిపై నోరు మెదపలేదు. అలాగే నితీశ్ కుమార్ ప్రభుత్వంపై తేజస్వీ యాదవ్ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ పార్టీ అయినప్పటికీ బీహార్‌లో ఆర్జేడీదే పైచేయి అని తెలిపారు.ఆరాలో జరిగిన ర్యాలీలో తేజస్వీ యాదవ్ మాట్లాడతూ.. తాను ప్రకటించిన సంక్షేమ పథకాలనే సీఎం నితీశ్ కుమార్ అమలు చేస్తున్నారని ఆరోపించారు. ‘‘ముందు నేను వెళ్తుంటే ప్రభుత్వం వెనుక వస్తోంది’’ అని అన్నారు. ఈ సభలోనే ప్రజలను ఓ సూటి ప్రశ్న అడిగారు. ‘‘మీకు కాపీ కొట్టే సీఎం కావాలా? ఒరిజినల్ సీఎం కావాలా?’’ అంటూ ప్రశ్నించారు. అలాగే మహా ఘట్‌బంధన్ తరఫున సీఎం అభ్యర్థిని తానేనని తేజస్వి మరోసారి నొక్కి చెప్పారు. అయితే రెండోసారి చెప్పినప్పుడు కూడా రాహుల్ గాంధీ మౌనంగానే ఉండిపోయారు. బీహార్‌లో కాంగ్రెస్ కంటే ఆర్జేడీ పెద్దన్న పాత్ర పోషిస్తుందని తేజస్వీ పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కంటే తమ పార్టీకే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని ఆయన చెప్పకనే చెప్పారు. తేజస్వీ ప్రకటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా రాహుల్ గాంధీ, అఖిలేష్‌యాదవ్ సమక్షంలోనే ఆయన ఈ కామెంట్లు చేయగా.. వీరిద్దరూ నోరు మెదపకపోవడం గమనార్హంగా నిలిచింది. ముఖ్యంగా తేజస్వీ యాదవ్ మొదటి నుంచీ నితీష్ కుమార్ ప్రభుత్వాన్ని తప్పు పడుతూనే వస్తున్నారు. తీవ్ర విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. పదవీ విరమణ వయసు 60 ఏళ్లేనని మరి 75 ఏళ్ల సీఎం అవసరమా అంటూ వ్యాఖ్యానించారు. నితీష్ కుమార్ సీఎం పదవి నుంచి తొలగిపోవాలంటూ పదే పదే డిమాండ్ చేశారు.



# అఫ్ఘానిస్థాన్‌లో భారీ భూకంపం..

కాబూల్: భారత్ పొరుగు దేశం అఫ్ఘానిస్థాన్‌లో భారీ భూకంపం సంభవించింది. పాకిస్థాన్ సరిహద్దులోని కునార్ ప్రావిన్స్‌లో సంభవించిన ఈ భూకంపం రిక్టార్ స్కేల్‌పై 6.0 తీవ్రతగా నమోదైంది. ఈ ప్రకృతి ప్రకోపానికి 250 మందికిపైగా మృతి చెందగా.. 500 మంది వరకూ గాయపడి ఉంటారని అధికారులు భావిస్తున్నారు. నంగర్హార్ ప్రావిన్స్‌లోని జలాలాబాద్ సమీపంలో భూకంప కేంద్రం 8 కిలోమీటర్ల లోతులో కేంద్రీకృతమై ఉంది. ఆదివారం అర్ధరాత్రి 11.47 గంటల ప్రాంతంలో ఈ భూకంపం సంభవించినట్లు అధికారులు తెలిపారు. ఆ తర్వాత వరుసగా మరో నాలుగు సార్లు భూకంపం సంభవించింది. 1.08 గంటల నుంచి ఉదయం 5.16 గంటల సమయంలో ఇక్కడ భూమి కంపించినట్లు సమాచారం. అయితే అఫ్ఘానిస్థాన్ అధికారులు మాత్రం 20 మందే ప్రాణాలు కోల్పోయారని స్థానిక అధికారులు చెబుతున్నారు. కానీ, యూఎస్ జియోలాజికల్ సర్వే మాత్రం వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని.. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. ఈ భూకంప తీవ్రతకు సంబంధించిన పలు వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. బాధితులుక అత్యవసర సహాయం అవసరమని పలువురు పోస్ట్‌లు పెడుతున్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in